ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

విశాఖపట్నం

జిల్లా వార్తలు

బుధవారం 28 మే 2025





ఈస్ట్ పాయింట్ కాలనీలో ప్రైవేటు వ్యక్తి ఆధీనంలో ఉన్న పార్కు


ప్లాంట్ అడ్మిన్ భవనంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు

ఉక్కులో ఉద్రిక్తత

చలో అడ్మిన్ బిల్డింగ్‌కు కాంట్రాక్టు కార్మికుల పిలుపు

- భవనంలోకి వెళ్లేందుకు కార్మికుల యత్నం
- అడ్డుకున్న పోలీసులు
- ఇరువర్గాల నడుమ తోపులాట
- చర్చలకు యాజమాన్యం పిలుపు
- డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని వెల్లడి
- నేడు ప్లాంటు గేట్ల దిగ్బంధం


విధులకు హాజరయ్యేందుకు వెళుతున్న కార్మికులను బస్సు నుంచి దించేస్తున్న ఆందోళనకారులు

ఉక్కుటౌన్‌షిప్, మే 27 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికులు మంగళవారం పరిపాలనా భవనం ముట్టడికి యత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చలో అడ్మిన్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఉదయం ఎనిమిది గంటలకు కాంట్రాక్టు కార్మికులు టీటీఐ జంక్షన్ వద్దకు చేరుకున్నారు. తొమ్మిది గంటల వరకూ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తరువాత అక్కడ నుంచి ర్యాలీగా పరిపాలనా భవనం వద్దకు చేరుకున్నారు. అయితే అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు...కాంట్రాక్టు కార్మికులను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, కాంట్రాక్టు కార్మికుల మధ్య తోపులాట జరిగింది. శాంతియుతంగా నిరసన తెలుపుకోవాలని, పోలీసులతో గొడవ మంచిది కాదని కార్మిక సంఘ నాయకులకు సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ సర్దిచెప్పారు. దీంతో కార్మికులు పరిపాలనా భవనం ముందు బైఠాయించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకూ తమ ఆందోళన కొనసాగించారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మిక నాయకులను యాజమాన్యం చర్యలకు పిలవాలని డిమాండ్ చేశారు.

కార్మిక సంఘ నాయకులు సమావేశం...

ప్లాంటు ప్రధాన పరిపాలనా భవనం ముందు కాంట్రాక్టు కార్మికులు బైఠాయించడంతో నాయకులను యాజమాన్యం చర్చలకు

... మిగతా 4వ పేజీలో

పార్కులు కబ్జా!

నివాసానికి అనుకూలంగా నిర్మాణాలు

దైవ సేవ పేరుతో స్వాధీనం

- స్థానికులు రాకుండా అడ్డుకుంటున్న వైనం
- విలువ రూ.20 కోట్లపైనే...
- జీవీఎంసీకి కాలనీ అసోసియేషన్ ఫిర్యాదు
- నెల రోజులైనా చర్యలు శూన్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోని ఈస్ట్ పాయింట్ కాలనీలో ఇరవై కోట్ల రూపాయల విలువ చేసే పార్కులను కొందరు కబ్జా చేసి వారి నివాసంగా మార్చుకున్నారు. సాయిబాబా సేవ పేరుతో దశాబ్ద కాలంగా వాటిలోనే ఇళ్లు కట్టుకొని నివాసం ఉంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.



అన్యాక్రాంతమైన మరో పార్కు

ఈస్ట్ పాయింట్ కాలనీలో ఆంధ్ర యూనివర్సిటీ కో-ఆపరేటివ్ సొసైటీ 1969లో లేఅవుట్ వేసి అందులో సభ్యులకు ప్లాట్లు కేటాయించింది. సామాజిక అవసరాల కోసం అక్కడక్కడా ఖాళీ స్థలాలను విడిచి పెట్టింది. కాలక్రమంలో ఒక స్థలంలో సాయిబాబా ఆలయం నిర్మించారు. మరొక స్థలంలో కేడీపీఎం హైస్కూల్ నిర్మించారు. సాయిబాబా ఆలయానికి సమీపానే ఒక మార్గంలో రోడ్డుకు ఎదురెదురుగా 1,500 గజాలు, 600 గజాల విస్తీర్ణంలో పార్కులు నిర్మించారు. వాటిని నిర్వహణ కోసం జీవీఎంసీకి అప్పగించారు. అయితే సాయిబాబా ఆలయ నిర్వాహకుల్లో ఒకరు బాబా పూజకు అవసరమైన మొక్కలు పెంచుతామంటూ ఒక పార్కును తన ఆధీనంలోకి తీసుకున్నారు. మరికొన్నాళ్లకు సాయిబాబాను సాయంత్రం వేళ పల్లకీలో తీసుకువచ్చి భక్తుల కోసం అందుబాటులో ఉంచుతామని చెప్పి రెండో పార్కును కూడా హస్తగతం చేసుకున్నారు. వాటిలో ఒక దానికి 'లెండీ వనం' అని, మరొక దానికి 'సాయిబాబా చావిడి' అని నామకరణం చేశారు. లెండీ వనంలో కొంత భాగాన్ని పక్కనే ఉన్న ఓ రాజకీయ నాయకుడు ఆక్రమించారు. బాబా సేవ పేరుతో పార్కులో తిష్ట వేసిన సేవకుడు ప్రస్తుతం స్థానికులు రాకుండా గేట్లను వేసేస్తున్నారు. పార్కు లోపల ఏమి జరుగుతున్నదో బయటకు కనిపించకుండా ఆరు అడుగుల ఎత్తుకు మించి ప్రహరీ నిర్మించారు. అన్ని పార్కులకు రెండు అంతకంటే ఎక్కువ గేట్లు ఉంటాయి. ఇక్కడ ఒకే ఒక గేటు ఉంచి, మిగిలిన వాటిని మూసేశారు. సాయిబాబా చావిడిలో ఏకంగా ఒక కుటుంబం నివాసం ఉండడానికి వీలుగా నిర్మాణాలు చేపట్టారు. పార్కులో బాత్‌రూమ్‌లు, వంట గదుల నిర్మాణాలు ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తే...మీకు సంబంధం లేదంటూ వారిని బయటకు పంపించేస్తున్నారు. ఇవన్నీ గమనించిన ఈస్ట్ పాయింట్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారితో సంప్రతింపులు జరిపి, పార్కులను తమకు అప్పగిస్తే అందరికీ ఉపయోగపడేలా నిర్వహిస్తామని కోరింది. దానికి వారు నిరాకరించడంతో అసోసియేషన్ ప్రతినిధులు జీవీఎంసీలో ఉద్యానవనాలు పర్యవేక్షించే అధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. తక్షణమే చర్యలు చేపడతామని చెప్పినా ఎటువంటి ఫలితం లేకపోవడంతో వారంతా కలిసి గత నెల 21వ తేదీన జీవీఎంసీ ప్రజా స్పందనలో ఫిర్యాదు చేశారు. నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని వారు రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. అయితే నెల పూర్తయినా ఒక్కరోజు కూడా అధికారులు వచ్చి ఏమి జరుగుతున్నదో పరిశీలించలేదని, సంఘం ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. పార్కుల స్థలం అందరికీ ఉపయోగపడాలని, అందులో నిర్మాణాలు తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


పార్కులో నిర్మాణాలు

అది కాలనీ ఆస్తి



బాబా సేవ పేరుతో పార్కును తీసుకొని అందులో ఇల్లు కట్టుకొని ఉంటున్నారు. స్థానికులను రానీయడం లేదు. తాళం వేసేస్తున్నారు. అది కాలనీకి చెందిన ఆస్తి. ఒక్కరి స్వాధీనంలో ఉంచడం అన్యాయం. దీనిపై జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించాలి. - వైవీ నరసింగరావు, ఈస్ట్ పాయింట్ కాలనీ

మహానాడులో నేతల సందడి


మహానాడు ప్రధాన వేదికపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు


మంత్రి నారా లోకేశ్‌తో పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు పెతకంశెట్టి గణబాబు


మహానాడు ప్రాంగణంలో భీమిలి నియోజకవర్గ కార్యకర్తలతో శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు

వర్షం... చల్లబడిన వాతావరణం


నగరంలో మంగళవారం సాయంత్రం సుమారు అరగంట సేపు వర్షం కురిసింది. ఆ తరువాత కూడా దఫదఫాలుగా రాత్రి వరకూ పడుతూనే ఉంది. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడుతున్నట్టు వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న 24 గంటల్లో వర్షాలు కురుస్తాయని, తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి.

10న రాష్ట్రపతి రాక

- గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న ద్రౌపది ముర్ము



విశాఖపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వచ్చే నెల పదో తేదీన విశాఖపట్నం రానున్నారు. ఆర్కే బీచ్‌రోడ్డులో గల ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. పదో తేదీ ఉదయం 9.50 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 11.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టులో గౌరవ వందనం స్వీకరించిన తరువాత 11.40 గంటలకు రోడ్ మార్గాన బయలుదేరి ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కన్వెన్షన్ సెంటర్ నుంచి బయలుదేరి 1.10 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని 1.20 గంటలకు ప్రత్యేక విమానంలో జార్ఖండ్ వెళతారు.

భువనేశ్వర్ విమాన సర్వీస్‌కు వీజీఎఫ్

విశాఖపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-భువనేశ్వర్ మధ్య జూన్ 12వ తేదీ నుంచి కొత్త విమాన సర్వీస్ ప్రారంభం కానుంది. దీనిని ఇండిగో సంస్థ నడుపుతుంది. ఒకవేళ ఆక్యుపెన్సీ తక్కువగా ఉండి ఆ సంస్థకు ఏమైనా నష్టాలు వచ్చినట్టయితే 'వయబులిటీ గ్యాప్ ఫండింగ్' (వీజీఎఫ్) ద్వారా భర్తీ చేయడానికి ఒడిశా ప్రభుత్వం అంగీకరించింది. దీనికి కృషిచేసిన ఆ రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబును ఏపీ విమాన ప్రయాణికుల సంఘం (అపాటా) ప్రతినిధులు నరేశ్‌కుమార్, కాశీవిశ్వనాథరాజు, డీఎస్ వర్మలు భువనేశ్వర్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విమాన సర్వీస్ ప్రతిరోజూ విశాఖపట్నానికి మధ్యాహ్నం 1.55 గంటలకు వచ్చి, తిరిగి 2.25 గంటలకు బయలుదేరి భువనేశ్వర్ వెళుతుంది. వారానికి నాలుగు రోజులు నడిచే అబుదాబి విమానం జూన్ 13 నుంచి ప్రారంభమవుతుందని, ఇది ఉదయం 8.20 గంటలకు విశాఖపట్నం వచ్చి, తిరిగి ఇక్కడి నుంచి 9.50 గంటలకు బయలుదేరుతుందని వారు తెలిపారు.

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమమే లక్ష్యం

జిల్లాలోని 776 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 9,354 మంది గర్భిణులు, 8,098 మంది బాలింతలు, 95,825 మంది చిన్నారులు

- అందరికీ పోషకాహారం అందేలా చర్యలు
- బాలికలకు అవగాహన కార్యక్రమాల నిర్వహణ
- సిబ్బందికి ఇబ్బందులేమైనా ఉంటే నేరుగా నాతో మాట్లాడవచ్చు
- గృహ హింస కేసులకు సామరస్యపూర్వకంగా పరిష్కారం
- ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ రామలక్ష్మి

విశాఖపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి): **అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ పోషకాలతో కూడిన ఆహారాన్ని అం దించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కేవీ రామలక్ష్మి తెలిపారు. ఆమె కాకినాడ స్పెషల్ ఎకనామిక్ జోన్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసి, కొద్దిరోజుల కిందట బదిలీపై ఐసీడీఎస్ పీడీగా వచ్చారు. జిల్లాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమలుచేస్తున్న కార్యక్రమాలతో పాటు అనేక అంశాలను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో రామలక్ష్మి వెల్లడించారు.**


కేవీ రామలక్ష్మి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రశ్న: జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్లు ఎన్ని ఉన్నాయి?, లబ్ధిదారుల సంఖ్య?

జవాబు: జిల్లాలో 776 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో 766 మంది టీచర్లు పనిచేస్తున్నారు. మరో పది ఖాళీలు ఉన్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో గర్భిణులు 9,354 మంది, బాలింతలు 8,098 మంది, ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 52,837 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 42,988 మంది ఉన్నారు. అందరికీ పోషకాలతో కూడిన కిట్లు అందించడంతోపాటు కేంద్రాల్లో ఆహారాన్ని కూడా అందిస్తున్నాం. వేసవి సెలవుల్లో కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహంచేలా సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. మిషన్ వాత్సల్య, కిశోర వికాసం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. కిశోర వికాసంలో భాగంగా పది నుంచి 18 ఏళ్లలోపు మధ్య బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. అమ్మాయిల్లో అభద్రతా భావాన్ని పోగొట్టడం, పోషకాహారం తీసుకోవడం, యుక్తవయసులో వచ్చే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి విషయాలపై అవగాహన కల్పించే

... మిగతా 4వ పేజీలో

ఏపీఈఏపీ సెట్-2025కు 94.37 శాతం మంది హాజరు

విశాఖపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీఈఏపీసెట్-2025కు జిల్లాలో 94.37 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏపీఈఏపీసెట్-2025ను ఈ నెల 19 నుంచి మంగళవారం వరకూ నిర్వహించారు. జిల్లాలో మొత్తం 41,162 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 38,845 (94.37 శాతం) మంది హాజరయ్యారు. ఇంజనీరింగ్ అండ్ ఫార్మసీ కోర్సుల పరీక్షకు 32,025 మంది హాజరుకావాల్సి ఉండగా, 30,505 (95.28 శాతం) మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ ప్రవేశ పరీక్షకు 9,137 మంది హాజరుకావాల్సి ఉండగా, 8,340 (91.28 శాతం) మంది హాజరయ్యారు.

మలేరియా ఉద్యోగాల భర్తీకి బ్రేక్

- కౌన్సిల్‌లో చర్చించాకే నిర్ణయం తీసుకోవాలని ప్రజారోగ్య విభాగం అధికారులకు కలెక్టర్ ఆదేశం
- ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు పోస్టులు పందేరం చేసినట్టు ఆరోపణలు

విశాఖపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మలేరియా విభాగంలో సీజనల్ కార్మికుల నియామకానికి బ్రేక్ పడింది. వచ్చేనెల ఆరున జరిగే కౌన్సిల్ సమావేశంలో చర్చించిన తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకోవాలని ప్రజారోగ్య విభాగం అధికారులను జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఉన్న జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదేశించినట్టు తెలిసింది. వర్షాకాలం ప్రారంభం కావడంతో మలేరియా, డెంగ్యూ జ్వరాల నియంత్రణకు 431 మంది సీజనల్ సిబ్బందిని నియమించుకోవాలని ప్రజారోగ్య విభాగం అధికారులు నిర్ణయించారు. వీరు ఇంటింటికీ వెళ్లి దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, డ్రై డే పాటించేలా అవగాహన కల్పించడం, లార్వాలను గుర్తించి నిర్వీర్యం చేయడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఏటా తాత్కాలిక సిబ్బందిని నియమించుకుంటారు. ఈ ఏడాది కూడా 431 మంది నియామకానికి ఫైల్ తయారుచేసి జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆమోదానికి పంపించారు. అయితే సీజనల్ మలేరియా కార్మికుల పోస్టుల భర్తీ గురించి తెలుసుకున్న కొందరు కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు తమకు కొన్ని కేటాయించాలని కోరారు. దీంతో అధికారులు కార్పొరేటర్‌కు మూడు, ఎమ్మెల్యేకు పది చొప్పున పంపకాలు వేశారు. మలేరియా పోస్టులు ఇప్పిస్తామంటూ కొందరు కార్పొరేటర్లు ఆశావహుల నుంచి డబ్బులు వసూలుచేస్తున్నట్టు



మే 22న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

... మిగతా 4వ పేజీలో

సంప్రదాయబద్ధంగా అప్పన్నకు నిత్యకల్యాణం



మధుపర్కాలు సమర్పిస్తున్న అర్చకులు

సింహాచలం, మే 27 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం నేత్రపర్వంగా సాగింది. ఇందులో భాగంగా మంగళవారం వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తి చేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. పాంచరాత్రాగమ శాస్త్రానుసారంగా కంకణధారణ, యజ్ఞోపవీత సమర్పణలు చేసి వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ జీలకర్ర బెల్లం, మాంగల్యధారణలు గావించారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు అందజేశారు.

ఇంజనీరింగ్ విద్యపై 31, 1వ తేదీల్లో
అవగాహన సదస్సులు

సాగర్‌నగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో సమగ్ర అవగాహన కల్పించేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, భువనేశ్వర్ (ఐఐటీ, భువనేశ్వర్) లో రెండు రోజుల అవగాహన సదస్సు నిర్వహించబోతున్నట్టు సంస్థ సమాచార శాఖ అధికారి దరిత్రి శతపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్ ఇంజనీరింగ్ మొదటి సెషన్ ఈ నెల 31న గీతం యూనివర్సిటీ శివాజీ ఆడిటోరియంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. అలాగే రెండో సెషన్ ఐఐటీ, భువనేశ్వర్ ప్రాంగణంలోని ఆడిటోరియంలో జూన్ 1న (ఆదివారం) మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదస్సుకు స్వయంగా లేదా వర్చువల్ తరహాలో ఆన్‌లైన్ మీటింగ్ లింగ్ https://shorturl.at/h2ibo ద్వారా సందేహాలకు సమాధానాలు పొందవచ్చన్నారు.

ఆదర్శ వనిత అహల్యాభాయి హోల్కర్



వేడుకల్లో మాట్లాడుతున్న మీనాకుమారి

పద్మనాభం, మే 27(ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల శాఖ, గాయత్రి యూత్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇక్కడి గోస్తనీ విద్యాపీఠ్ ప్రాంగణంలో మంగళవారం రాణి అహల్యాభాయి హోల్కర్ మూడవ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి డిప్యూటీ ఎంపీడీవో మీనా కుమారి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. 300 ఏళ్ల క్రితమే మహిళా సాధికారతకు అహల్యాభాయి పాటుపడి ఆదర్శంగా నిలిచారన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా వీర వనితలను స్మరించుకోవడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. అనంతరం వందమంది మహిళలకు జాకెట్టు ముక్కలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మెడికల్ విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్, బీజేపీ మండల అధ్యక్షురాలు టి.నాగమణి, వైసీపీ సీనియర్ నాయకులు టి.పద్దు, టీడీపీ నాయకుడు ఎర్నాయుడు, బీజేపీ నాయకులు శ్రీనివాసరావు, కృష్ణారావు, పేర్రాజు, వెంకటరావు, సామాజిక సేవకుడు బి.రాము తదితరులు పాల్గొన్నారు.

8న గీతం అడ్మిషన్ టెస్ట్

డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహణ

సాగర్‌నగర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ వర్సిటీ స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశానికి జూన్ నెల 8వ తేదీన గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్) నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ ఎం.జగదీష్ మంగళవారం తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విత్ కాగ్నిటివ్ సిస్టమ్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో నాలుగేళ్ల బీఎస్సీ (ఆనర్స్) కోర్సులు, మూడు సంవత్సరాల బీసీఏ కోర్సు నిర్వహిస్తున్నామని వివరించారు. రెండు సంవత్సరాల ఎమ్మెస్సీ కోర్సులు, మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కోర్సులలో ప్రవేశానికి ఐదో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు గీతం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీఐటీఏఎం.ఇడియును సంప్రదించాలన్నారు. క్యాట్, జేఈఈ వంటి జాతీయ స్థాయి పరీక్షలలో ఉత్తీర్ణత పొందిన వారు తమ ర్యాంక్ కార్డుతో నేరుగా ప్రవేశాలు పొందవచ్చునని వివరించారు.

నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు

పద్మనాభం-రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల నుంచి చెత్త వ్యర్థాలు సేకరించి, వాటి ద్వారా కంపోస్టు తయారు చేసి విక్రయించడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలన్న లక్ష్యం నీరుగారింది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సంపద సృష్టి కేంద్రాలు ఆరేళ్లుగా ఉత్సవ విగ్రహాలుగా మారాయి. తడి-పొడి చెత్త నుంచి సేంద్రీయ ఎరువు తయారికీ అనుగుణంగా చేసిన ఏర్పాట్లు ప్రస్తుతం నిరూపయోగంగా ఉన్నాయి. ప్రారంభంలో కేంద్రాలు సక్రమంగా పని చేసినప్పటికీ.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటి గురించి పట్టించుకోలేదు. దీంతో సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. కూటమి ప్రభుత్వం హయాంలోనైనా ఈ సంపద కేంద్రాల నిర్వహణపై శ్రద్ధ చూపాలని రైతులు కోరుతున్నారు.



కురపల్లిలో నిరుపయోగంగాఉన్న చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం

శాస్త్రీయ విధానాలతో మేలు...

వ్యర్థాల వినియోగంలో శాస్త్రీయ విధానాలు అనుసరిస్తే సరికొత్త సంపద సృష్టించవచ్చు. తడి-పొడి వ్యర్థాల విషయంలో సృజనాత్మకత అలోచన చేసి వాటిని పునర్వినియోగిస్తే పారిశుధ్యం సమస్యనూ అధిగమించవచ్చు. ఆకులు, కొమ్మలు పొడి చెత్తత కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం జరుగుతోంది. వాటిని కంపోస్టుగా మారిస్తే ఎరువు తయారుఅవుతుంది. ఈ విధంగా అధికారులు చర్యలు తీసుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా....

పంచాయతీల్లో చెత్తశుద్ధి కేంద్రాల నిర్మాణాలు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా వాటి వినియోగం జరగడం లేదు. దీంతో ఈ కేంద్రాలు ఉపయోగించుకుంటే పంచాయతీలకు ఆదాయం పెరుగుతుంది. రహదారలు వెంట చెత్తాచెదారం పారబోయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వినియోగంలో లేకపోవడంతో ఈ కేంద్రాలు రాత్రి సమయాల్లో ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారాయి.

అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు

సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. సేంద్రియ ఎరువుల తయారు చేసేలా కృషి చేస్తాం. పంచాయతీలకు ఆదాయం సమకూర్చే దిశగా నిర్వహణ మార్పులు తీసుకువస్తాం. మండలంలో 22 పంచాయతీలు ఉండగా, 9 పంచాయతీల్లో సంపద కేంద్రాలు నిర్మించాం. వీటిని త్వరలో వినియోగంలోకి తీసుకువచ్చేందు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

- మీనాకుమారి, ఈవోపీఆర్డీ, పద్మనాభం

మహానాడులో భీమిలి టీడీపీ నేతలు



మహానాడుకు తరలి వెళ్లిన భీమిలి టీడీపీ నేతలు, కార్యకర్తలు

భీమునిపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి) : మహానాడు పండుగకు ముస్తాబైన కడపకు భీమిలి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు శుక్రవారం చేరారు. గురువారం రాత్రి భీమిలి బీచ్ రోడ్డులో ఉన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్యాలయం నుంచి సీనియర్ టీడీపీ నాయకులు గాడు సన్యాసినాయుడు పార్టీ జెండా ఊపి ప్రారంభించిన ప్రత్యేక బస్సులో వీరందరూ బయలుదేరారు. శుక్రవారం కడప సమీపంలో సీకే దిన్నె మండలం చెర్లోపల్లి, షబ్బాపురం గ్రామాల మధ్య సువిశాలమైన ప్రాంతంలో మహానాడు వేదిక వద్దకు చేరారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో మహానాడు జరుగుతుంది. కాగా, భీమిలి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు అక్కడి నారాయణ స్కూలులో బస ఏర్పాటు చేసినట్టు నేతలు తెలిపారు. టీడీపీ నాయకులు మాజీ కౌన్సిలర్లు ఎ.గురునాథరావు, గొలగాని నరేంద్ర కుమార్, కనకల అప్పలనాయుడు, కంచర్ల కామేష్, షేక్ అన్వర్, ఆవాల సూరిబాబు, గరే సదానంద తదితరులు ఉన్నారు.

ఆనందపురం నేతల సందడి..

ఆనందపురం, మే 27 : కడపలో జరుగుతున్న 42వ మహానాడులో ఆనందపురం నాయకులు సందడి చేశారు. ఆనందపరం నుంచి భారీ ఎత్తున నాయకులు ప్రత్యేక వాహనాల్లో మహానాడుకు తరలి వెళ్లారు. మండలం నుంచి నాయకులు బీఆర్‌బీనాయుడు, తాట్రాజు అప్పారావు, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, పాండ్రంకి అప్పలరాజు, మహంతి శివాజీ, గండ్రెడ్డి స్వామినాయుడు, రమేష్, బమ్మిడి సూర్యనారాయణ, ఉమ తదితరులు 25 కార్లు, ఒక బస్సులో సుమారు 150 మంది బయలుదేరి వెళ్లారు. కడపలో జరుగుతున్న మహానాడులో భీమిలి శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమాల్లో పాల్గొని సందడి చేస్తున్నారు.



మహానాడు ప్రాంగణంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో ఆనందపురం టీడీపీ నాయకులు

వాహనాల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ



చెత్త తరలిస్తున్న పారిశుధ్య సిబ్బంది

తగరపువలస, మే 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అధికారులు తీసుకున్న నిర్ణయం మేరకు వివిధ ప్రాంతాల్లో డంపర్‌బిన్లను తొలగించారు. వీధుల్లోనూ, ఇళ్ల ముందు చెత్తలను వాహనాల ద్వారా సేకరించే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇంతవరకూ వివిధ కూడళ్లలో చెత్తకుండీలు ఉండేవి. పరిసరవాసులు చెత్తను ఈ కుండీల్లో వేసేవారు. ఇప్పుడు వాటిని అధికారులు తొలగించారు. తమ ఇళ్లల్లో తడి-పొడి చెత్తను వాహనాలకు అందించే అలవాటు చేయడానికి ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. అయితే కొందరు గతంలో చెత్తకుండీలు ఉన్న ప్రాంతాల్లోనే చెత్తను కుప్పలుగా పోస్తున్నారు. వాహనంలో ఉన్న సిబ్బంది ఈ చెత్తను కూడా తొలగిస్తున్నారు. తగరపువలస ప్రధాన కూడలిలో నిత్యం పేరుకు పోతున్న చెత్తను తొలగించేందుకు కూడా పారిశుధ్య వాహనాలను ఏర్పాటు చేయడం వల్ల చాలామంది ఈ వాహనాలకు తమ చెత్తను అందిస్తున్నారు. అయితే అధికారులు కొన్ని ముఖ్యమైన కూడలి ప్రాంతాలలో అయినా చెత్తకుండీలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న భీమిలి పోలీసులు

తగరపువలస, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గోస్తనీ వంతెన వద్ద మంగళవారం రాత్రి భీమిలి పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. పోలీసు కమిషనరేట్ నుంచి అందిన ఆదేశాల మేరకు ఎస్‌ఐ గంట హరీష్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వచ్చే వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పద వాహనాల రికార్డులపై ఆరా తీశారు. పత్రాలు సక్రమంగా లేని పది వాహనాలకు జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న ఇద్దరు డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. సుమారు మూడు గంటల పాటు ఈ తనిఖీలు నిర్వహించామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.తిరుమలరావు తెలిపారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ఫైరింగ్‌లో శిక్షణ

సాగర్‌నగర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : సమాజ సేవతో పాటు దేశరక్షణకు కృషి చేయాలని 13(ఎ) బెటాలియన్ ఎల్‌టీకల్నల్ కమాండింగ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 150 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు ఫైరింగ్‌లో మెళకువలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే సాధించలేని ఉండదన్నారు. అనంతరం డ్రాయింగ్, పెయింటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.స్వర్ణమ్ సుబేదార్, మేజర్ శ్రీనివాస్, రవీందర్‌సింగ్, సుజన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం మండలంలో 12 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు

పద్మనాభం, మే 27 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల నుంచి కొత్తవిద్యా సంవత్సరం ఆరంభం కానున్నందున పాఠశాల విద్యలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో 12 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు (మోడల్ ప్రైమరీ)ను గుర్తించారు. ఇప్పటికే ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచడం, కిలోమీటరులోపు ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో మూడు, నాలుగు, ఐదు తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ఆదర్శ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తారు. అనంతవరం, గంధవరం, మద్ది, పద్మనాభం, కృష్ణాపురం, రెడ్డిపల్లి, చిన్నాపురం, పొట్నూరు, పాండ్రంగి, రేవిడి, కొత్త కొవ్వాడ, బీఆర్ తాళ్లవలస తదితర గ్రామాలలోని మండల పరిషత్ పాఠశాలలు ఇక నుంచి మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా గుర్తిస్తారు. ఒకటి రెండు తరగతులతో నిర్వహించే ఫౌండేషన్ పాఠశాలలు 18, ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఉండే బేసిక్ ప్రాథమిక పాఠశాలలు 21 ఉన్నాయి. ఇప్పటికే ఉన్న రెండు ప్రాథమికోన్నత పాఠశాలల్లో పొట్నూరు పాఠశాలను జడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. కె.కొవ్వాడ ప్రాథమికోన్నత పాఠశాలను ఆదర్శప్రాథమిక పాఠశాలగా గుర్తించారు. దీంతో మండలంలో ప్రాథమికోన్నత పాఠశాలలు కనుమరుగయ్యాయి.

నేటి నుంచి అప్పన్న సన్నిధిలో జ్యేష్ట మాసోత్సవాలు

సింహాచలం, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో బుధవారం నుంచి జ్యేష్ఠమాసంలో పలు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 29న ఆర్ద్ర నక్షత్రం సందర్భంగా ఎంబెరుమన్నార్ తిరునక్షత్ర పూజలు, 30న గంగధార సమీపం సీతారామస్వామి ఆలయంలో సంక్షిప్తరామాయణ హవనం, అప్పన్న సన్నిధిలోని రామాయణంలో శ్రీరామ పట్టాభిషేక సర్గ విసర్గ విన్నపం, జూన్ 3న ఆండాళ్ తిరునక్షత్ర పూజలు, 5న నమ్మాళ్వార్ తిరునక్షత్ర పూజలు, 7న శుక్లపక్ష ఏకాదశి స్వర్ణతులసీ దళార్చన, లక్ష్మీనారాయణుల వార్షిక తిరుకల్యాణ మహోత్సవం జరపనున్నారు. అలాగే, 8న నరసింహుని ఆవిర్భావ నక్షత్రం పురస్కరించుకుని స్వాతి నక్షత్ర హవనం, 9న నమ్మాళ్వార్ తిరునక్షత్ర చాత్తు, 10న నృసింహ జయంతి, 11న జేష్ఠ పూర్ణిమ మూడవ విడత చందన సమర్పణ, 12న తిరునక్షత్ర పూజలు, 15న మిథున సంక్రమణం, శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని కొండదిగువ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో సుదర్శన హవనం, 21న స్మార్త ఏకాదశి, 22న శ్రీకూర్మజయంతి, 24న మాదవధార వేణుగోపాలస్వామి సన్నిధిలో అష్టాక్షరీ మంత్ర హవనం తదితర వైదిక ఉత్సవాలను నిర్వహించనున్నారు.

భగవద్గీత
అనుసరణీయం

సింహాచలం, మే 27(ఆంధ్రజ్యోతి): కురుక్షేత్ర సంగ్రామానికి ముందు అర్జునుడికి శ్రీకృష్ణ భగవానుడు ఉపదేశించిన భగవద్గీత సర్వమానవాళికి అనుసరణీయమని గీతా ప్రచార సాధకులు మిందీ బాబ్జీ వాసుదేవ అన్నారు. అడివివరం శాఖా గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరానికి మంగళవారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భగవద్గీతలోని ప్రతి శ్లోకములోని సారాంశాన్ని గ్రహించి, నిత్య జీవితంలో ఆచరిస్తే సత్ఫలితాలు పొందవచ్చునన్నారు.

దళితులపై దాడుల అంశం ఎస్సీ కమిషన్‌కు పిర్యాదు : వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి నాగమల్లేశ్వరి

మద్దిలపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు పిర్యాదు చేయనున్నట్టు వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి నాగమల్లేశ్వరి తెలిపారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై తీవ్రంగా దాడులు జరుగుతున్నా హోంమంత్రి అనిత తనకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హోంమంత్రి సొంత నియోజకవర్గంలోనే దళితలను బహిష్కరించినా ఆమె నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. నక్కపల్లి మండలంలో ఆరుగురు దళితులను చావబాదినా పట్టించుకోలేదన్నారు. దళితులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అన్యాయమన్నారు. దళిత మహిళా హోంమంత్రిగా ఉన్న రాష్ట్రంలో దళితులు, మహిళలకు రక్షణ లేకుండా పోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి దళితులు బహిష్కరించే రోజు త్వరలో వస్తుందని హెచ్చరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న నాగమల్లేశ్వరి

మహానాడులో గంటా సందడి

భీమునిపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి) : కడపలో ఘనంగా ప్రారంభమైన తెలుగుదేశం మహానాడు పండుగలో మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, అతడి తనయుడు నియోజక వర్గ ఇన్‌చార్జి గంటా రవితేజలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఉత్సాహంగా కనిపించారు. పలువురు నేతలతో మాట్లాడుతూ కనిపించారు. అలాగే ఆయన తనయుడు రవితేజ కూడా మహానాడులో ఉత్సాహంగా పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా మాటామంతీ



కోలాటం కళాకారులతో పదం కలిపిన గంటా రవితేజ

ఆర్ఈసీఎస్ నుంచి తరలించిన
మెటీరియల్ విలువ రూ.6 కోట్లు

» అనకాపల్లి ఎస్ఈ జి.ప్రసాద్

విశాఖపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి): కశింకోటలోని అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఈసీఎస్) నుంచి సింహాచలంలోని ఈపీడీసీఎల్ స్టోర్స్‌కు తరలించిన మెటీరియల్ విలువ రూ.6 కోట్లు మాత్రమేనని అనకాపల్లి ఎస్ఈ జి.ప్రసాద్ మంగళవారం తెలిపారు. రెండేళ్లుగా ఆ మెటీరియల్ నిరుపయోగంగా ఉన్నందున పాడైపోతుందని, అంతేకాక అక్కడ ఆ మెటీరియల్‌కు సరైన భద్రత లేని కారణంగా తరలించామన్నారు. దీనిని ఆర్ఈసీఎస్ అవసరాల కోసమే ఉపయోగిస్తున్నామన్నారు.ఈ మెటీరియల్ తరలింపునకు రూ.19.64 లక్షలు అక్కడి అధికారి అంచనాలు సమర్పించినా, ఈపీడీసీఎల్‌కు చెందిన వాహనాల్లో, సొంత సిబ్బందే తరలించినందున ఎటువంటి రవాణా బిల్లులు చెల్లించలేదని స్పష్టం చేశారు.

మలేరియా ఉద్యోగాల భర్తీకి బ్రేక్

... 3వ పేజీ తరువాయి

ఆరోపణలు వచ్చాయి. అవుట్‌సోర్సింగ్‌లో పెట్టించేస్తామని మధ్యవర్తి ఒక్కొక్కరి నుంచి రూ.50 వేలు చొప్పున డిమాండ్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై ఈనెల 22న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్‌హరేంధిరప్రసాద్ మలేరియా పోస్టుల భర్తీని తక్షణం నిలిపివేయాలని ఆదేశించారు. వచ్చే నెల ఆరున జరిగే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన తర్వాతే భర్తీ విషయంలో ముందుకువెళ్లాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఉక్కులో ఉద్రిక్తత

... 3వ పేజీ తరువాయి

పిలిచింది. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకుంటే తక్షణమే సమ్మె విరమిస్తామని కార్మిక నాయకులు తెలిపారు. దీనికి అధికారులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారని, కానీ స్పష్టమైన హామీ ఇవ్వలేదని కార్మిక నాయకులు చెప్పారు. యాజమాన్యం దిగివచ్చేంత వరకు పోరాటాలు చేస్తామని కార్మిక నాయకులు పేర్కొన్నారు.

నేడు ప్లాంట్ గేట్ల దిగ్బంధం

యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా బుధవారం ప్లాంటు గేట్ల దిగ్బంధానికి కాంట్రాక్టు కార్మిక నాయకులు పిలుపునిచ్చారు. ప్లాంటు ప్రధానగేటు, విస్తరణ గేటు, బీసీ గేటు, లేబర్ గేట్లను దిగ్బంధిస్తామని ప్రకటించారు. కార్మిక వర్గం నిరవధిక సమ్మెలో పాల్గొనాలని కోరారు.

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమమే లక్ష్యం

... 3వ పేజీ తరువాయి

కార్యక్రమాలు చేపడుతున్నాం.

ప్ర: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయా.?

జ: జిల్లాలో మొత్తం 776 అంగన్‌వాడీ సెంటర్లకుగాను 208 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. మరో 360 కేంద్రాలను ప్రభుత్వ, సామాజిక భవనాల్లో నిర్వహిస్తున్నాం. మరో 207 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ప్రస్తుతం 10 కొత్త భవనాలు నిర్మాణ దశలో ఉండగా, మరో 16 భవనాల నిర్మాణానికి సంబంధించి గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు అందించేందుకు ఉన్నతాధికారులు సిద్ధంగా ఉన్నారు.

ప్ర: అంగన్‌వాడీ సిబ్బందిపై పని ఒత్తిడి, వేధింపులపై ఏమంటారు?

జ: ప్రస్తుతం వర్క్ అంతా యాప్‌లో చేయాల్సి వస్తోంది. దీనిని మొదట్లో కొందరు ఇబ్బందిగా ఫీల్ అయ్యేవారు. ప్రస్తుతం బాగానే చేస్తున్నారు. వేధింపులు ఎవరికీ ఉండవు. ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా నాతో మాట్లాడవచ్చు. అందరికీ అందుబాటులో ఉంటాను. ఫేస్ అటెండెన్స్ యాప్‌లో హాజరు వేయాల్సి వస్తోంది. ఇది కొందరికి ఇబ్బందిగా ఉంటోంది. కానీ, ఇప్పుడు అన్ని సమస్యలూ పరిష్కారమయ్యాయి. గతంలో నెట్‌వర్క్ సమస్యలు, యాప్ పనిచేయకపోవడం వల్ల ఇబ్బంది ఉండేది. ఇప్పుడు అటువంటివి ఏమీ లేవు.

ప్ర: జీతాలు, ఇతర అలవెన్సులు పెండింగ్‌లో ఉన్నాయా.?

జ: జీతాలు పెండింగ్‌లో లేవు. అద్దె బకాయిలు కొంతవరకు పెండింగ్‌లో ఉన్నాయి. అవి కూడా క్లియర్ అవుతాయి. ప్రతి ఫైల్ క్లియర్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నా. రోజులు తరబడి ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చూసుకుంటున్నా.

ప్ర: దత్తత ప్రోగ్రామ్‌ను అమలు ఎలా ఉంది.?

జ: పిల్లలు లేని తల్లిదండ్రులకు దత్తత ఇచ్చే కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తోంది. పిల్లలు కావాలనుకునే వాళ్లు ఎవరైనా వెబ్‌సైట్‌లోకి వెళ్లి అప్లై చేసుకోవచ్చు. జాబితా ప్రకారం వారికి అవకాశం వచ్చినప్పుడు పిల్లలను అందిస్తాం. జిల్లాలో ఇప్పటివరకూ 160 మంది చిన్నారులను దత్తత ఇచ్చాం. 148 మందిని దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వారికి ఇవ్వగా, 12 మందిని ఇతర దేశాలకు చెందిన వారికి అందించాం. శిశు గృహలో దత్తత ఇచ్చేందుకు సిద్ధంగా 20 మంది చిన్నారులు ఉన్నారు.

ప్ర: డీవీ సెల్‌లో నమోదయ్యే కేసులను సంగతేంటి?

జ: డొమెస్టిక్ వయలెన్స్ సెల్‌లో నమోదయ్యే కేసులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఈ సెంటర్‌లో కౌన్సిలర్లు, లీగల్ కౌన్సిలర్లు ఉంటారు. అక్కడకు వచ్చే బాధితులకు వారు అండగా ఉంటున్నారు. వీలైనంత వరకూ గృహహింస, ఇతర వేధింపులపై నమోదయ్యే కేసులను సామరస్య పూర్వకంగా పరిష్కరించేందుకు ఈ సెల్ పనిచేస్తోంది. బాధిత మహిళలకు అండగా ఉంటోంది. ఈ ఏడాదిలో 260 కేసులను డీవీ సెల్ ద్వారా క్లియర్ చేశాం. మరో 50 వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని త్వరితగతిని పూర్తి చేసేలా సిబ్బంది పని చేస్తున్నారు.



కమిటీ ప్రతినిధులకు నగదు అందజేస్తున్న దృశ్యం

ఆలయ నిర్మాణానికి విరాళాలు

అగనంపూడి, మే 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడకలో చేపడుతున్న రామాలయ నిర్మాణానికి దాత గొల్లవిల్లి భాగ్య పైడిరాజు తన వంతు సాయంగా రూ.25,201తో పాటు చందాల ద్వారా సేకరించిన రూ.21,640 నగదును మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి భవిష్యత్తులోనూ సహాయ సహకారాలను అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు విందుల నారాయణరావు, గుదే సుశీలగజేంద్రరావు, వి.సతీశ్, బి.అప్పలనాయుడు, వి.రాజు, లక్ష్మణ్, రాజేశ్, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

కథల కూర్పుపై ప్రత్యేక శిక్షణ

పెందుర్తి, మే 27 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం కథలు చెప్పడం, రాయడం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు కూర్పుపై మెళకువలు నేర్పించారు. అనంతరం యోగా, ధ్యానం చేశారు. ఆంగ్ల బోధన, బెలూన్ గేమ్ ఆటలాడించారు. గ్రంథాలయాధికారి సూర్యకళ, యోగా గురువు చంద్రకళ, విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాలికలు క్రీడల్లోనూ రాణించాలి

గాజువాక, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం వీరేశలింగం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి బి.చంద్రకళ బాల్య వివాహలు, సంఘ సంస్కర్తల గురించి వివరించారు. బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

పెదగంట్యాడ, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో కొద్ది రోజులుగా నిర్వమిస్తున్న క్రీడా పోటీలు మంగళవారంతో ముగిశాయి. వేసవి విజ్ఞాన శిబిరంలో బాగంగా క్రికెట్, ఖోఖోతో పాటు కథల పోటీలను నిర్వహించారు. పెదగంట్యాడ పరిసరాల్లోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా వీటిలో పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి పీవీ రమణ ఈ పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు శిబిరం ముగింపు రోజున బహుమతులను అందజేస్తామన్నారు.

లక్ష్యాలతో విజయాలు సాధ్యం

మల్కాపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఒక లక్ష్యాన్ని పెట్టుకోవాలని, దానివైపు సానుకూల దృక్పథంతో పనిచేస్తే విజయం సొంతం చేసుకోవచ్చని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ఉపాధ్యాయురాలు పద్మజ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడుతూ విజయం సాధించడానికి భావవ్యక్తీకరణ ఎంతో అవసరమన్నారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చరిత్రపై క్విజ్ పోటీని నిర్వహించారు.

సినిమా గైడ్

- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం)
- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **నిశ్శబ్దప్రేమ** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం),
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: రమాదేవి, సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 15, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 18, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 32, బీరకాయలు 36, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజీ 15, క్యారెట్ 38 దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది) 9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 54, బరబాటి 26, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోసకాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 30, క్యాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 38, కంద 64, గోరుచిక్కుడు 32, దేముడుచిక్కుడు 44, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, బూడిద గుమ్మడికాయ 20, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230



బాజీ జంక్షన్ సర్వీస్ రోడ్డులో విరిగిపడిన హైట్‌గేజ్



బాజీ జంక్షన్‌లో స్తంభించిన ట్రాఫిక్

బాజీ జంక్షన్‌లో విరిగిపడిన హైట్‌గేజ్

- గుర్తు తెలియని వాహనం ఢీకొనడమే కారణం!
- గంటన్నరపాటు స్తంభించిన ట్రాఫిక్

ఎన్.ఎ.డి.జంక్షన్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎన్ఏడీ ఫ్లైఓవర్ కిందకు భారీ వాహనాలు ప్రవేశించకుండా ఏర్పాటు చేసిన ఐరన్ హైట్‌గేజ్ విరిగిపోయింది. బాజీ జంక్షన్ బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో ఏర్పాటు చేసిన దీనిని సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియన భారీ వాహనం ఢీకొనడంతో ఇది విరిగిపోయినట్టు తెలిసింది. ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాగా రాత్రిపూట భారీ వాహనాలకు కనిపించేలా ఉండాల్సిన రేడియమ్ స్టిక్కర్స్ ఈ హైట్‌గేజ్‌పై లేకపోవడం కూడా ప్రమాదానికి కారణం కావచ్చని పలువురు పేర్కొంటున్నారు.

ఏర్పాటు చేసిన రెండున్నర నెలల్లోనే..

బాజీ జంక్షన్ నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ జంక్షన్‌లోనే సర్వీస్ రోడ్డు నుంచి వచ్చే భారీ వాహనాలు సెంటర్ రోడ్డుకు మారాల్సి ఉంటుంది. గతంలో ఎన్ఎస్‌టీఎల్ కూడలి ముందు భారీ వాహనాలను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన హైట్‌గేజ్‌ను ఓ వాహనం ఢీకొనడంతో విరిగిపోయింది. దీంతో మార్చి నెలలో కొత్తగా బాజీ జంక్షన్ సర్వీస్ రోడ్డు వద్ద ఈ హైట్‌గేజ్‌ను వీఎంఆర్‌డీఏ అధికారులు ఏర్పాటు చేశారు. దీనిపై కేవలం నలుపు, తెలుపు రంగులు మాత్రమే వేసి రేడియమ్ స్టిక్కర్స్ అతికించడాన్ని మరచిపోయారు. ఈ స్టిక్కర్స్ ఉంటే రాత్రిపూట భారీ వాహనాలకు ఇది కనిపించే అవకాశం ఉంటుంది. ఆ స్టిక్కర్స్ లేకపోవడం వల్లే గుర్తు తెలియన వాహనం దీనిని ఢీకొని ఉంటుందని పలువురు భావిస్తున్నారు. కాగా ప్రమాదానికి కారణమైన వాహనాన్ని కూడా పోలీసులు గుర్తించాల్సి ఉంది.

స్తంభించిన ట్రాఫిక్..

హైట్‌గేజ్ కూలి రోడ్డుకు అడ్డంగా పడడంతో బాజీ జంక్షన్‌లో మంగళవారం ఉదయం ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఇక్కడి సర్వీస్ రోడ్డులో ద్విచక్ర వాహనాలు, ఆటోలు మాత్రమే వెళుతుంటాయి. అయితే రోడ్డుకు అడ్డంగా హైట్‌గేజ్ ఒరిగిపడడంతో వాహనదారులు ముందుకు వెళ్లలేక సుమారు గంటన్నరపాటు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు క్రేన్‌ను తెప్పించి దీనిని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇక్కడ కొత్తగా ఏర్పాటు చేసే హైట్‌గేజ్‌కైనా తప్పనిసరిగా రేడియమ్ స్టిక్కర్స్ ఉండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కణితి రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని డిమాండ్



ట్రాఫిక్ స్తంభించడంతో కణితి రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

గాజువాక, మే 27 (ఆంధ్రజ్యోతి): కణితి రోడ్డులో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గాజువాకకు కీలకమైన కణితి రోడ్డును సింధియా వైపు గల కర్మాగారాలకు, ఆయా ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారు వినియోగిస్తుంటారు. దీంతో ఎప్పుడూ ఈ రహదారి వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డును 60 నుంచి 80 అడుగుల మేరకు విస్తరించినప్పటికీ ట్రాఫిక్ సమస్యలు మాత్రం ఏ మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. ప్రధానంగా ఈ మార్గంలో నిత్యావసర వస్తువులకు సంబంధించి హోల్‌సేల్ షాపులు, బంగారం దుకాణాలు, ప్రధాన కూరగాయాల మార్కెట్‌తో పాటు అన్ని రకాల సామగ్రి లభించే వ్యాపార సంస్థలు ఉన్నాయి. ఆయా వస్తువులను కొనుగోలు చేసేందుకు చుట్టపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు ఇక్కడకే వస్తుంటారు. అందువల్ల రోజురోజుకూ ట్రాఫిక్ సమస్యలు అధికమవుతున్నాయి. అయితే ఈ మార్గం లోకి భారీ వాహనాలు యథేచ్ఛగా వచ్చి వెళుతుండ డంతోనే ట్రాఫిక్ సమస్యలు అధికమవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఈ మార్గంలో భారీ వాహనాలు రాకుండా స్టాపర్లను ఏర్పాటు చేసినప్పటికీ వాటిని నియంత్రంచే సిబ్బంది లేకపోవడంతో యథేచ్ఛగా ఆ వెహికల్స్ రాకపోకలు సాగిస్తున్నాయి. అందువల్ల ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టవలసిందిగా స్థానికులు, వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైభవంగా పైడితల్లమ్మ అనుపోత్సవం



అక్కిరెడ్డిపాలెంలో పూజలందుకున్న పైడితల్లమ్మ



పొన్నూరు అగ్రహారంలో కొలువుదీరిన దుర్గమాంబ

అక్కిరెడ్డిపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిపాలెం, డెయిరీ కాలనీ, పరిసర ప్రాంతాల ప్రజల ఇలవేల్పు శ్రీపైడితల్లమ్మ అనుపోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో వేకువజామున అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, నూతన వస్త్రాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పసుపుకుంకుమలతో పాటు మొక్కులు చెల్లించారు. సాయింత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ పొన్నూరు అగ్రహారం ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని నూతన వస్త్రాలు, పత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు దొప్ప ప్రభాకర్, ఏదూరి జానకీరామ్, యు.శ్రీను, డి.వెంకటరమణ, జి.ఉదయ్ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రాల ఆవిష్కరణ

జీవీఎంసీ 79వ వార్డు పరిధి అన్నపూర్ణానగర్‌లో నిర్మించిన శ్రీపూర్ణ మహాగణపతి ఆలయ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రాలను కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు పూజాది కార్యక్రమాలను నిర్వహించి ఆలయం ప్రారంభంతో పాటు విగ్రహ ప్రతిష్ట జరుపుతామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు దానబాల సన్యాసిరావు, వీఆర్‌సీ మూర్తి, ఎం.అప్పారావు, డి.దేముడు, జి.పాపారావు, శ్యామ్‌సన్, నాగేశ్వరరావు, మురళీ, బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సరిపల్లిలో పరదేశిమాంబ జాతర



పెందుర్తి: మండలంలోని సరిపల్లి గ్రామస్థుల ఆరాధ్య దైవం పరదేశిమాంబ జాతరను వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించారు. సాయంత్రం అమ్మవారి ఘటాల ఊరేగింపులో ఏర్పాటు చేసిన కోలాటాలు, చిడతలు, సాముగారిడీలు, విచిత్ర వేషధారణలు వంటి వాటితో పాటు బాణసంచా కాల్పులు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఊరేగింపులో పెద్దసంఖ్యలో గామ స్థులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

బుచ్చిరాజుపాలెంలో బంగారమ్మ..

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో శ్రీబంగారమ్మ మారువారం పండగను మంగళవారం ఘనంగా త్రివేణి గ్రామ అభ్యుదయ సేవా సంఘం సభ్యులు నిరవ్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

కాలబైరవస్వామికి ప్రత్యేక పూజలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు గరుడాద్రిపై ఉన్న శ్రీవేంకటేశ్వరాలయ ఆవరణలో గల శ్రీకాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం జరిపారు. అమావాస్యను పురస్కరించుకుని ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పూజాది కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రధాన పూజారి రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో శాంతి హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల, కమిటీ సభ్యులు పి.రాజు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



దువ్వాడ ప్రధాన రహదారి పక్కన తిష్ఠ వేసిన మురుగు నీరు

మురుగు కదలదు.. దుర్వాసన వదలదు!

- స్వైరవిహారం చేస్తున్న దోమలు
- జ్వరాల బారినపడుతున్నామని స్థానికుల ఆవేదన

కూర్మన్నపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు పరిధి దువ్వాడ ప్రధాన రహదారి పక్కనే మురుగు నీరు తిష్ఠ వేయడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులతో పాటు స్థానికులు భరించరాని దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోజుల తరబడి మురుగు ఉండడం వల్ల దోమలు విజృంభిస్తున్నాయని, దీంతో జ్వరాలు, వ్యాధులబారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వాడుక నీరు పెద్దఎత్తుల వచ్చి ఇక్కడ నిలిచిపోతుండడంతో రోడ్డు పక్కన గెడ్డలా మారిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంలూ పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులకు వినతులు సమర్పించినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా వారు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.

వీధి నాటకంతో హెచ్ఐవీపై అవగాహన

మల్కాపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో, విశాఖపట్నం లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహణలో, భద్రం ఫౌండేషన్ ఎయిడ్స్ నివారణ పై మంగళవారం వీధి నాటకం ప్రదర్శించారు. ఎయిడ్స్ పై అవగహన కల్పిస్తూ, హెచ్ఐవీ పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలని, ఈ వ్యాధి గ్రస్థుల పట్ల వివక్ష చూపించరాదని, 2017 ఎయిడ్స్ చట్టం గురించి నాటకం ద్వారా వివరించారు. ఇతర సహాయాల కోసం 1097 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. లారీ డ్రైవర్లు తమకున్న సందేహాలను ప్రశ్న రూపంలో భద్రం ఫౌండేషన్ సభ్యులను అడిగి పరిష్కరించుకున్నారు.



నీటితో కళకళలాడుతున్న మేహాద్రిగెడ్డ రిజర్వాయర్

'మేహాద్రిగెడ్డ'లో సమృద్ధిగా నిల్వలు

గోపాలపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి): వేసవి పూర్తవుతున్నప్పటికీ ఈ ఏడాది మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు సమృద్ధిగానే ఉన్నాయి. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 61 అడుగులు కాగా, కనిష్ఠ నీటిమట్టం 44 అడుగులు. గత ఏడాది మే నెలలో రిజర్వాయర్ నీటిమట్టం 46.2 అడుగులకు చేరింది. డిసెంబరు వరకు అడపాదడపా వర్షాలు కురవడంతో 58 అడుగుల వద్ద రిజర్వాయర్ నీటిమట్టం స్థిరంగా ఉంది. అయితే ఈ ఏడాది దాదాపుగా వేసవి ముగిసింది. ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం 52.7 అడుగులు ఉండడంతో ఈ ఏడాది నీటి నిల్వలు ఎక్కువగానే ఉన్నాయని చెప్పవచ్చు. ప్రతిరోజూ రిజర్వాయర్ నుంచి సుమారుగా 8 ఎంజీడీల నీటిని తాగునీటి అవసరాల కోసం జీవీఎంసీ వినియోగిస్తోంది. దీంతో ఏటా మే నెలాఖరుకు రిజర్వాయర్ నీటిమట్టం దాదాపు డెడ్‌స్టోరేజీకి చేరుకునేది. కానీ ఈ ఏడాది మాత్రం నీటి నిల్వలు సమృద్ధిగానే ఉన్నాయి. ఈ ఏడాది మే నెల ప్రారంభం నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో గతేడాది కన్నా ఈసారి సుమారు 6.6 అడుగుల మేర నీటిమట్టం అధికంగా ఉంది. దీంతో రిజర్వాయర్‌కు ఈ ఏడాది నీటిగండం తప్పిందని పలువురు అంటున్నారు.

వర్షంతో ఉపశమనం పొందిన ప్రజలు

గోపాలపట్నం, మే 27(ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలకు నగర ప్రజలు అల్లాడిపోయారు. మంగళవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నా సాయంత్రం చేసి వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఎండ వేడి నుంచి ఉపశమం పొందారు.



దల్లి గోవిందరాజును సత్కరిస్తున్న నిర్వాసిత సంఘం నాయకులు

డిప్యూటీ మేయర్ 'దల్లి'కి సత్కారం

పెదగంట్యాడ, మే 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన దల్లి గోవిందరాజును ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. పెదగంట్యాడలోని డిప్యూటీ మేయర్ కార్యాలయంలో ఆయనను నిర్వాసిత సంఘం నాయకులు గొందేశి మహేశ్వరరెడ్డి, సత్యారావు, తదితరులు కలిసి పలు సమస్యలను వివరించారు. నిర్వాసిత కాలనీల అభివృద్ధికి అధికంగా నిధులు కేటాయించేలా చూడాలని, అసంపూర్తిగా ఉన్న పలు అభివృద్ధి పనులను త్వరితంగా పూర్తి చేయించాలని వేడుకున్నారు. డిప్యూటీ మేయర్‌ను కలిసిన వారిలో సంఘం నాయకులు యెల్లేటి శ్రీనివాసరావు, పిట్ట కంచారావు, జి.పైడిరాజు, ఎస్.పరదేశి, శ్రీపెంటమాంబ ఆలయ కమిటీ డైరెక్టర్లు ఉన్నారు.

భెల్‌లో పీఎఫ్‌పై అవగాహన సదస్సు



పీఎఫ్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ భెల్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి): భెల్ హెచ్‌పీవీపీలో ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పీఎఫ్ అధికారులు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కార్మికుల నుంచి మంచి స్పందన వచ్చింది. బీహెచ్‌పీవీలో 1992లో వివిధ సిరీస్‌ల కింద చేరిన కార్మికులకు డేట్ ఆఫ్ జాయినింగ్ నమోదులో ఏర్పడిన పొరపాట్ల వల్ల తలెత్తిన పీఎఫ్ సమస్యను పరిష్కరించవలసిందిగా పీఎఫ్ అధికారులకు సీఐటీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పీఎఫ్ అధికారి విశ్వనాథ్ ప్రావిడెంట్ ఫండ్ ఆవశ్యకతతో పాటు పీఎఫ్ విభాగంలో ఎదురయ్యే సమస్యలు, పరిష్కార మార్గాలను వివరించారు. కర్మాగారంలో ఆర్, డీ-సిరీస్ కార్మికులు గత కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యను పీఎఫ్ అధికారులకు వివరించి పలు కార్మిక సంఘాల నాయకులు వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు జీటీపీ ప్రకాశ్, సనపల జగన్నాథరావు, సీతం నాయుడు, కె.నారపరెడ్డి, పి.ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

సీపీఐ గాజువాక కార్యదర్శి కె.సత్యనారాయణ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లోని పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల పేదలకు మూడు సెంట్ల ఇళ్ల స్థలాలను ఇవ్వాలని సీపీఐ గాజువాక కార్యదర్శి కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక పోతిన సన్యాసిరావు భవన్‌లో మంగళవారం జరిగిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కె.వనజాక్షి, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పి.సూర్యపద్మ, పి.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు. తొలుత పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలంటూ రూపొందించిన వాల్ పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు.

యోగసిద్ధాంజనేయ ఆలయంలో విశేష అర్చనలు



మురళీనగర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పాలిటెక్నిక్ కళాశాల సమీపం సూర్యానగర్ యోగ సిద్ధాంజనేయ ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు అరవెల్లి శ్రీకాంత్ ఆచార్యులు స్వామివారికి సింధూర అర్చన, తమలపాకుల పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకులు పి.సుబ్బరాజు, కమిటీ సభ్యులు ఎంవీరాజశేఖర్ పాల్గొన్నారు.

కాలభైరవ స్వామికి విశేష పూజలు



డాబాగార్డెన్స్, మే 27 (ఆంధ్రజ్యోతి) : వైశాఖ అమావాస్య సందర్భంగా పాత జైల్‌రోడ్డులో గల కాలభైరవ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత స్వామివారికి అలంకరణలు చేపట్టిన అనంతరం అష్టోత్తర శతనామావళి, అష్టభైరవ హోమాది కార్యక్రమాలను అర్చకులు గోపాజ్యోశ్యుల సత్య జగన్నాథశర్మ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

20 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేత

మహారాణిపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల పరిధిలో పనిచేసేందుకు కారుణ్య నియామకాల కింద 20 మందికి జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ మంగళవారం నియామక పత్రాలను అందజేశారు. కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్. భవానీ శంకర్‌తో కలిసి జూనియర్ అసిస్టెంట్లుగా, కార్యాలయ సహాయకులుగా నియమితులైన వారికి ఆయన పత్రాలను అందించారు. సమర్థవంతంగా విధులు నిర్వహించి మంచి గుర్తింపు పొందాలని సూచించారు. ఈవో ఈశ్వర రావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ఎన్టీఆర్ జయంత్యుత్సవం

మహారాణిపేట, మే 27(ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక వేడుకగా నిర్వహించాలని ఆదేశించినట్టు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించనున్నామని వివరించారు. ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు, సిబ్బంది హాజరు కావాల్సిందిగా కోరారు.

'అవాంఛిత కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి'

డాబాగార్డెన్స్, మే 27 (ఆంధ్రజ్యోతి) : అవాంచిత కాల్స్‌పై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని బీఎస్ఎన్ఎల్ సీజీఎం పాల్ విలియమ్స్ సూచించారు. డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పామ్‌కాల్స్ గురించి వినియోగదారులకు అవగాహన కలిగించారు. పీజీఎం ఆపరేషన్స్ జి.ఆడమ్స్ మాట్లాడుతూ డిజిటల్ అరెస్టులపై వివరించారు. డీజీఎం బి.శ్రీనివాస్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ఎలా అవగాహన కలిగి ఉండాలో తెలియజేశారు. ఈ సమావేశానికి ఎస్ఈడీ పి.శ్రీనివాస్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

మహోన్నతుడు ఎన్టీఆర్ : యార్లగడ్డ


యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను సత్కరిస్తున్న రాగమాలిక సాంస్కృతిక సేవా సంస్థ సభ్యులు

డాబాగార్డెన్స్, మే 27 (ఆంధ్రజ్యోతి) : మహోన్నతుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) అని ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. విశాఖ పౌర గ్రంథాలయంలో మంగళవారం రాగమాలిక సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి కేవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నవరస స్వరనీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడకకు ముఖ్యఅతిథిగా హాజరై సంస్థ అధ్యక్షులు చౌదరి అప్పారావు, కేవీ సత్యనారాయణ, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, మేడా మస్తాన్‌రెడ్డి, చెన్నా తిరుమలరావు, భయ్యా శ్రీనివాస్, సన్‌మూర్తితో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ఎన్టీఆర్ గొప్ప సంఘ సంస్కర్తగా పేర్కొన్నారు. ఆయన ఒక నటుడిగా, ముఖ్యమంత్రిగానే భావిస్తారని కానీ ఆయనలో ఒక సంఘ సంస్కర్త కూడా ఉన్నారన్నారు. సంస్థ కార్యదర్శి కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్టీఆర్ నటించిన పాత్రలు అన్నితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. అనంతరం ఎన్టీఆర్ గీతాలాపనలో భాగంగా 'పుణ్యభూమి నాదేశం నమోన మామి...', 'చిత్రం భళారే... విచిత్రం' వంటి పాటలను గాయనీ గాయకులు జి.సత్యనారాయణ, భరద్వాజ్, రమేష్, మహమ్మద్‌ఖాన్, సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, సుజాత, ఇందిర సాహిని, నాగలక్ష్మి, సుజాతలు ఎంతో శ్రావ్యంగా ఆలపించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళపద్మారాధన పూజలు


విశేష అలంకరణలోఉన్న అమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మహారాణిపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత వన్‌టౌన్‌లోని బురుజుపేటలో గల కనక మహాలక్ష్మి ఆలయంలో అష్టదళ పద్మారాధన పూజలను మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఈ వేడుకను జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. మహిళలు పసుపు, కుంకుమ తదితరాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి) : సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా బుధవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహనగర్, రైతు బజారు ఏరియా, విద్యుత్‌నగర్ ఏరియా, పోర్టు ఈస్ట్ గేటు ఏరియా, బాలయ్య శాస్త్రిలే అవుట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పనుందన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

ఎర్నిమాంబకు సారె సమర్పణ


సారెను ఊరేగింపుగా ఆలయానికి తీసుకు వస్తున్న మహిళలు

జ్ఞానాపురం, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎర్నిమాంబ ఆలయంలో అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం జ్ఞానాపురం వాసులు అమ్మవారికి పెద్దఎత్తున సారెను సమర్పించారు. ఇళ్లలో తయారు చేసిన లడ్డూలు, అరిసెలు, సున్నుండలు, బూరెలు, మైసూర్‌పాక్ తదితర వివిధ రకాల పిండి వంటకాలను మహిళలు పళ్లాల్లో పేర్చి జ్ఞానాపురం జేఎస్ఎన్ యూఆర్ఎం కాలనీ నుంచి ఆలయం వరకు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకు వచ్చారు. అక్కడ నైవేద్యంగా సమర్పించి, వాటిని ప్రసాదంగా భక్తులకు పంచిపెట్టారు. అనంతరం ఆలయ ఈవో సురేష్‌బాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చుక్కా శ్యామ్ సుందర్ రెడ్డి, కూటమి నాయకులు ఐతి రవిబాబు, ఆంథోనీ శేఖర్, పిల్లి గోవింద్‌రాజులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వచ్చే నెల ఒకటిన డీఎస్సీ మోడల్ టెస్ట్

▸▸ కరపత్రాలను ఆవిష్కరించిన ఆర్జేడీ భాస్కరరావు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ భాస్కరరావు, తదితరులు

సీతమ్మధార, మే 27 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జూన్ ఒకటో తేదీన నిర్వహించనున్న డీఎస్సీ మోడల్ టెస్ట్‌కు సంబంధించిన కరపత్రాలను ఆర్‌జేడీ విజయ భాస్కర్ మంగళవారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిరుద్యోగ అభ్యర్థులకు ఉపయోగపడే విధంగా డీఎస్సీ మోడల్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ టెస్ట్‌ను గోపాలపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల, అనకాపల్లిలోని ఎంజీహెచ్ఎస్, నర్సీపట్నం జడ్పీ హైస్కూల్, పాడేరులో నిర్వహించనున్నట్టు చెప్పారు. పూర్తి వివరాలకు 99850 55099, 98493 67678 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు నుంచి పారిపోయి వచ్చిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

విశాఖపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి) : తండ్రి మందలించాడని ఏలూరు నుంచి విశాఖపట్నానికి పారిపోయి వచ్చిన బాలుడ్ని క్షేమంగా అతని తల్లిదండ్రులకు టూటౌన్ పోలీసులు మంగళవారం అప్పగించారు. ఇందుకు సంబంధించి సీఐ ఎర్రం నాయుడు తెలిపిన వివరాలివి. ఏలూరు జిల్లా ఉంగుటూరు చెందిన వెంప శివకుమార్ కొడుకు వెంకటేశ్వరరావు (17) ఐటీఐ చదువుతున్నాడు. నిత్యం సెల్ ఫోన్‌కు బానిసయ్యాడు. దీంతో తండ్రి అతనిని మందలించాడు. ఇందుకు తీవ్ర మనస్థాపం చెందిన అతడు సోమవారం ఇంటినుంచి పారిపోయాడు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికిన అనంతరం కుటుంబ సభ్యులు అక్కడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంకటేశ్వరావు చేసిన ఫోన్ ఆధారంగా విశాఖలో ఉన్నట్టు గుర్తించారు. ఆ సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు వెంటనే విశాఖకు చేరుకుని టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. వెంకటేశ్వరరావు కల్లుపాకలు ప్రాంతంలో ఉన్నట్టు గుర్తించారు. ఎస్ఐ సింహాచలం, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరాజు అక్కడకు వెళ్లి ఆ బాలుడ్ని పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా సిబ్బందిని సీఐ అభినందించారు. పోలీసులకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

'టీచర్ల బదిలీల్లో అసంబద్ధతలను తొలగించాలి'

సీతమ్మధార, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బదిలీల్లోని అసంబద్ధతలను తొలగించాలని ఎస్టీయూ, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్, హెచ్ఎం అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్‌కు మంగళవారం వినతి పత్రం సమర్పించారు.

29 నుంచి చదరంగంలో ఉచిత శిక్షణ

మాధవధార, మే 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 50వ వార్డు పరిధి మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి జూన్ ఏడో తేదీ వరకు చెస్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ మంగళవారం తెలిపారు. వాకర్స్ క్లబ్ ప్రాంగణంలోని కళా వేదిక వద్ద ప్రతి రోజూ సాయంత్రం 4.30 గంటల నుంచి ఆరు గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. చదరంగం మాస్టర్ ఉమాపతి బాలబాలికలకు ఆటలో మెళకువలను నేర్పిస్తారన్నారు. ఔత్సాహికులు 76598 04633 , 94912 92369 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు. బాలలకు తాగునీరు, స్నాక్స్ ఆటకు వేదిక, చెస్ మాస్టర్‌ని మాత్రమే సమకూరుస్తామన్నారు. ఆటకు కావలసిన చదరంగం బోర్డు వారే తమ వెంట తీసుకురావాలని సూచించారు.

నేటి నుంచి అప్పన్న సన్నిధిలో జ్యేష్ట మాసోత్సవాలు

సింహాచలం, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో బుధవారం నుంచి జ్యేష్ఠమాసంలో పలు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 29న ఆర్ద్ర నక్షత్రం సందర్భంగా ఎంబెరుమన్నార్ తిరునక్షత్ర పూజలు, 30న గంగధార సమీపం సీతారామస్వామి ఆలయంలో సంక్షిప్తరామాయణ హవనం, అప్పన్న సన్నిధిలోని రామాయణంలో శ్రీరామ పట్టాభిషేక సర్గ విసర్గ విన్నపం, జూన్ 3న ఆండాళ్ తిరునక్షత్ర పూజలు, 5న నమ్మాళ్వార్ తిరునక్షత్ర పూజలు, 7న శుక్లపక్ష ఏకాదశి స్వర్ణతులసీ దళార్చన, లక్ష్మీనారాయణుల వార్షిక తిరుకల్యాణ మహోత్సవం జరపనున్నారు. అలాగే, 8న నరసింహుని ఆవిర్భావ నక్షత్రం పురస్కరించుకుని స్వాతి నక్షత్ర హవనం, 9న నమ్మాళ్వార్ తిరునక్షత్ర చాత్తు, 10న నృసింహ జయంతి, 11న జేష్ఠ పూర్ణిమ మూడవ విడత చందన సమర్పణ, 12న తిరునక్షత్ర పూజలు, 15న మిథున సంక్రమణం, శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని కొండదిగువ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో సుదర్శన హవనం, 21న స్మార్త ఏకాదశి, 22న శ్రీకూర్మజయంతి, 24న మాధవధార వేణుగోపాలస్వామి సన్నిధిలో అష్టాక్షరీ మంత్ర హవనం తదితర వైదిక ఉత్సవాలను నిర్వహించనున్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ఫైరింగ్‌లో శిక్షణ

సాగర్‌నగర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : సమాజ సేవతో పాటు దేశరక్షణకు కృషి చేయాలని 13(ఎ) బెటాలియన్ ఎల్‌టీకల్నల్ కమాండింగ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 150 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు ఫైరింగ్‌లో మెళకువలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే సాధించలేని ఉండదన్నారు. అనంతరం డ్రాయింగ్, పెయింటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహంచారు. ఈ కార్యక్రమంలో ఎం.స్వర్ణమ్ సుబేదార్, మేజర్ శ్రీనివాస్, రవీందర్‌సింగ్, సుజన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

8న గీతం అడ్మిషన్ టెస్ట్

సాగర్‌నగర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ వర్సిటీ స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశానికి జూన్ నెల 8వ తేదీన గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్) నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ ఎం.జగదీష్ మంగళవారం తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విత్ కాగ్నిటివ్ సిస్టమ్స్, మైక్రో బయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో నాలుగేళ్ల బీఎస్సీ (ఆనర్స్) కోర్సులు, మూడు సంవత్సరాల బీసీఏ కోర్సు నిర్వహిస్తున్నామని వివరించారు. రెండు సంవత్సరాల ఎమ్మెస్సీ కోర్సులు, మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కోర్సులలో ప్రవేశానికి ఐదో తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచిం చారు. పూర్తి వివరాలకు గీతం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జిఐటిఎఎమ్.ఇడియును సంప్రదించాలన్నారు. క్యాట్, జేఈఈ వంటి జాతీయ స్థాయి పరీక్షలలో ఉత్తీర్ణత పొందిన వారు ర్యాంక్ కార్డుతో నేరుగా ప్రవేశాలు పొందవచ్చన్నారు.

ఆర్ఈసీఎస్ నుంచి తరలించిన

మెటీరియల్ విలువ రూ.6 కోట్లు : ఎస్ఈ ప్రసాద్

విశాఖపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి): కశింకోటలోని అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఈసీఎస్) నుంచి సింహాచలంలోని ఈపీడీసీఎల్ స్టోర్స్‌కు తరలించిన మెటీరియల్ విలువ రూ.6 కోట్లు మాత్రమేనని అనకాపల్లి ఎస్ఈ జి.ప్రసాద్ మంగళవారం తెలిపారు. రెండేళ్లుగా ఆ మెటీరియల్ నిరుపయోగంగా ఉన్నందున పాడైపోతుందని, అంతేకాక అక్కడ ఆ మెటీరియల్‌కు సరైన భద్రత లేని కారణంగా తరలించామన్నారు. దీనిని ఆర్ఈసీఎస్ అవసరాల కోసమే ఉపయోగిస్తున్నామన్నారు. ఈ మెటీరియల్ తరలింపునకు రూ.19.64లక్షలు అక్కడి అధికారి అంచనాలు సమర్పించినా, ఈపీడీసీఎల్‌కు చెందిన వాహనాల్లో, సొంత సిబ్బందే తరలించినందున ఎటువంటి రవాణా బిల్లులు చెల్లించలేదని స్పష్టం చేశారు.

మలేరియా ఉద్యోగాల భర్తీకి బ్రేక్

... 3వ పేజీ తరువాయి

ఆరోపణలు వచ్చాయి. అవుట్‌సోర్సింగ్‌లో పెట్టించేస్తామని మభ్యపెట్టి ఒక్కొక్కరి నుంచి రూ.50 వేలు చొప్పున డిమాండ్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై ఈనెల 22న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్‌హరేంధిరప్రసాద్ మలేరియా పోస్టుల భర్తీని తక్షణం నిలిపివేయాలని ఆదేశించారు. వచ్చే నెల ఆరున జరిగే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన తర్వాతే భర్తీ విషయంలో ముందుకువెళ్లాలని అధికారులకు స్పష్టంచేశారు.

ఉక్కులో ఉద్రిక్తత

... 3వ పేజీ తరువాయి

పిలిచింది. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకుంటే తక్షణమే సమ్మె విరమిస్తామని కార్మిక నాయకులు తెలిపారు. దీనికి అధికారులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారని, కానీ స్పష్టమైన హామీ ఇవ్వలేదని కార్మిక నాయకులు చెప్పారు. యాజమాన్యం దిగివచ్చేంత వరకు పోరాటాలు చేస్తామని కార్మిక నాయకులు పేర్కొన్నారు.

నేడు ప్లాంట్ గేట్ల దిగ్బంధం

యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా బుధవారం ప్లాంటు గేట్ల దిగ్బంధానికి కాంట్రాక్టు కార్మిక నాయకులు పిలుపునిచ్చారు. ప్లాంటు ప్రధానగేటు, విస్తరణ గేటు, బీసీ గేటు, లేబర్ గేట్లను దిగ్బంధిస్తామని ప్రకటించారు. కార్మిక వర్గం నిరవధిక సమ్మెలో పాల్గొనాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

▸▸ వివిధ శాఖల సిబ్బంది సమావేశంలో కార్పొరేటర్ నాగరాజు


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ నాగరాజు

అల్లిపురం, మే 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 32వ వార్డును పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు అంతా కంకణ బద్ధులు కావాలని కార్పొరేటర్ కందుల నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం ఇక్కడి కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో పారిశుధ్యం మెరుగుకు పలు సూచనలు చేశారు. రానున్నది వర్షాకాలమని అంటు వ్యాధులు ప్రబలకుండా వీధుల్లో చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. అలాగే ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తేనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ, సచివాలయ సిబ్బందితో పాటు హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

'విభిన్న ప్రతిభావంతులకు స్నో స్టేషన్‌లో ఉచిత ప్రవేశం'


స్నో స్టేషన్‌లో సందడి చేస్తున్న విభిన్న ప్రతిభావంతులు

అక్కయ్యపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి) : వచ్చే వారం నుంచి ప్రతి బుధవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విశాఖలోని విభిన్న ప్రతిభావంతుల పాఠశాలల విద్యార్థులు, పాపాహోం, చెవిటి, మూగ విద్యార్థులకు అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌తో పాటు స్నో స్టేషన్‌లోకి ఉచితంగా ప్రవేశం కల్పిస్తామని క్లబ్ అధినేత బొడ్డేటి కాశీ విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయా పాఠశాలలు, సంస్థల నిర్వాహకులు ముందుగా వచ్చి తమను సంప్రదించాలన్నారు. ఇదిలావుంటే, అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగలలోని హాస్టల్‌లో ఉంటున్న 175 మంది విభిన్న ప్రతిభావంతులు విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌ను సందర్శించారు. అనంతరం వీరికి స్నో స్టేషన్‌లోకి ఉచితంగా ప్రవేశం కల్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ డైరెక్టర్లు నరేంద్ర, రాకేష్ పాల్గొన్నారు

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమమే లక్ష్యం

... 3వ పేజీ తరువాయి

కార్యక్రమాలు చేపడుతున్నాం.

ప్ర: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయా.?

జ: జిల్లాలో మొత్తం 776 అంగన్‌వాడీ సెంటర్లకుగాను 208 కేంద్రాలకు సొంత భవ నాలు ఉన్నాయి. మరో 360 కేంద్రాలను ప్రభుత్వ, సామాజిక భవనాల్లో నిర్వహిస్తున్నాం. మరో 207 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ప్రస్తుతం 10 కొత్త భవనాలు నిర్మాణ దశలో ఉండగా, మరో 16 భవనాల నిర్మాణానికి సంబంధించి గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు అందించేందుకు ఉన్నతాధికారులు సిద్ధంగా ఉన్నారు.

ప్ర: అంగన్‌వాడీ సిబ్బందిపై పని ఒత్తిడి, వేధింపులపై ఏమంటారు?

జ: ప్రస్తుతం వర్క్ అంతా యాప్‌లో చేయాల్సి వస్తోంది. దీనిని మొదట్లో కొందరు ఇబ్బందిగా ఫీల్ అయ్యేవారు. ప్రస్తుతం బాగానే చేస్తున్నారు. వేధింపులు ఎవరికీ ఉండవు. ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా నాతో మాట్లాడవచ్చు. అందరికీ అందుబాటులో ఉంటాను. ఫేస్ అటెండెన్స్ యాప్‌లో హాజరు వేయాల్సి వస్తోంది. ఇది కొందరికి ఇబ్బందిగా ఉంటోంది. కానీ, ఇప్పుడు అన్ని సమస్యలూ పరిష్కారమయ్యాయి. గతంలో నెట్‌వర్క్ సమస్యలు, యాప్ పనిచేయకపోవడం వల్ల ఇబ్బంది ఉండేది. ఇప్పుడు అటువంటివి ఏమీ లేవు.

ప్ర: జీతాలు, ఇతర అలవెన్సులు పెండింగ్‌లో ఉన్నాయా.?

జ: జీతాలు పెండింగ్‌లో లేవు. అద్దె బకాయిలు కొంతవరకు పెండింగ్‌లో ఉన్నాయి. అవి కూడా క్లియర్ అవుతాయి. ప్రతి ఫైల్ క్లియర్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నా. రోజులు తరబడి ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చూసుకుంటున్నా.

ప్ర: దత్తత ప్రోగ్రామ్ అమలు ఎలా ఉంది.?

జ: పిల్లలు లేని తల్లిదండ్రులకు దత్తత ఇచ్చే కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తోంది. పిల్లలు కావాలనుకునే వాళ్లు ఎవరైనా వెబ్‌సైట్‌లోకి వెళ్లి అప్లై చేసుకోవచ్చు. జాబితా ప్రకారం వారికి అవకాశం వచ్చినప్పుడు పిల్లలను అందిస్తాం. జిల్లాలో ఇప్పటివరకూ 160 మంది చిన్నారులను దత్తత ఇచ్చాం. 148 మందిని దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వారికి ఇవ్వగా, 12 మందిని ఇతర దేశాలకు చెందిన వారికి అందించాం. శిశు గృహలో దత్తత ఇచ్చేందుకు సిద్ధంగా 20 మంది చిన్నారులు ఉన్నారు.

ప్ర: డీవీ సెల్‌లో నమోదయ్యే కేసులను సంగతేంటి?

జ: డొమెస్టిక్ వయలెన్స్ సెల్‌లో నమోదయ్యే కేసులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఈ సెంటర్‌లో కౌన్సిలర్లు, లీగల్ కౌన్సిలర్లు ఉంటారు. అక్కడకు వచ్చే బాధితులకు వారు అండగా ఉంటున్నారు. వీలైనంత వరకూ గృహహింస, ఇతర వేధింపులపై నమోదయ్యే కేసులను సామరస్య పూర్వకంగా పరిష్కరించేందుకు ఈ సెల్ పనిచేస్తోంది. బాధిత మహిళలకు అండగా ఉంటోంది. ఈ ఏడాదిలో 260 కేసులను డీవీ సెల్ ద్వారా క్లియర్ చేశాం. మరో 50 వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని త్వరితగతిని పూర్తి చేసేలా సిబ్బంది పని చేస్తున్నారు.

పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు


కారు డిక్కీని తనిఖీ చేస్తున్న పోలీసులు

అక్కయ్యపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి) : కైలాసపురంలోని సాలిగ్రామపురం ఇనార్బిట్ మాల్ ఎదురుగా పోలీసులు మంగళవారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు రికార్డులు సరిగాలేని వాహనదారులకు జరిమానా విధించారు.

రైతు బజారు ఆవరణలో సిమెంట్ రేకులతో అవస్థలు

▸▸ ఇష్టారాజ్యంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్న వినియోగదారులు


రైతుబజారు ఆవరణలో కుప్పగా ఉంచిన సిమెంట్ రేకులు

అక్కయ్యపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్ రైతు బజారు ఆవరణలో పాత సిమెంట్ రేకులు కుప్పలుగా వేసి వదిలేశారు. దీంతో కూరగాయలు, ఆకు కూరలు తదితరాల కొనుగోలుకు విచ్చే వినియోగదారులు వాహనాలను నిలపడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని నెలల క్రితం రైతు బజారులోని స్టాల్స్‌పై ఉన్న సిమెంట్ రేకులను తొలగించి కొత్తగా ఇనుప రేకులు వేశారు. ఆ పాత రేకులను అక్కడే ఖాళీ స్థలంలో కుప్పగా వేశారు. అవి అడ్డుగా ఉండ డంతో వినియోగదారులకు ఇబ్బందులు తప్ప డం లేదు. ఈ కారణంగా ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేద్దామంటే వీలు కుదరకపోవడంతో పలువురు ఎక్కడబడితే అక్కడ అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా మిగతా వారు లోపలికి రావాలన్నా, బయటకు వెళ్లాలన్నా అవస్థలు పడుతున్నారు. ఇదిలావుంటే, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన రైతులు వారికి కేటాయించిన స్టాళ్లలో కాకుండా ఖాళీగా ఉన్న స్థలంలో అరటి గెలలు, ఇతర సామగ్రి పెడుతున్నారు. దీని వల్ల కూడా పలువురు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

భవన నిర్మాణంలో బిల్డర్ మాయాజాలం

- స్థలం యజమాని డెవలప్‌మెంట్‌కు ఇచ్చింది 137 గజాలు
- పక్కనే ఉన్న గెడ్డ స్థలం 47 గజాల ఆక్రమణ
- మొత్తం 183.55 గజాల స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం
- మూడు యూనిట్ల ప్లాన్ తీసుకుని 8 యూనిట్లు నిర్మాణం
- పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోని జీవీఎంసీ అధికారులు


గెడ్డస్థలన్ని ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

మద్దిలపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం కృష్ణా కళాశాలకు ఆనుకుని ఉన్న గెడ్డను మింగేస్తున్నారు. గెడ్డ పక్కనున్న స్థల యజమానులు నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా పర్వం సాగిస్తున్నారు. గెడ్డలను కుదించి రూ.లక్షల విలువైన స్థలాల్ని దర్జాగా ఆక్రమిస్తున్నారు.

మద్దిలపాలెంలోని విద్యానగర్ కాలనీ సర్వే నంబర్ 47 గెడ్డకు ఆనుకుని ఉన్న 137 గజాల స్థలాన్ని 1996లో పి.రామస్వామి వద్ద పక్కి మాధవరావు కొనుగోలు చేశారు. ఈ స్థలాన్ని సాయి కనస్ట్రక్షన్స్ నిర్వాహకులు డెవలప్‌మెంట్‌కు తీసుకున్నారు. అయితే పక్కనే గెడ్డ స్థలం ఖాళీగా ఉండడంతో దానిపై బిల్డర్ కన్నుపడింది. 47 గజాలున్న గెడ్డ స్థలాన్ని కలుపుకోవడానికి పావులు కదిపారు. స్థల యజమాని మాధవరావు తన భార్య సరస్వతికి 137 గజాల స్థలాన్ని ఇస్తున్నట్టు 2024, ఆగష్టు 16న రిజిస్ట్రేషన్ చేయించారు. దాంతో పాటూ పక్కనే ఉన్న గెడ్డ స్థలం 47 గజాలు పూర్వీకుల నుంచి సంక్రమించినట్టు పేర్కొంటు మాధవరావు తన భార్య సరస్వతి పేరు మీద మొత్తంగా 183.55 గజాల స్థలం రిజిస్ట్రేషన్ చేశారు. మద్దిలపాలెం ఏరియా వన్‌టౌన్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఉండగా, ఈ రిజిస్ట్రేషన్ పెదగంట్యాడ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చేయడం గమనార్హం. అంతేకాకుండా ఆస్తి సంక్రమించినట్టు పత్రాలు ఉంటేనే కానీ ఇతరుల పేరు మీదకు రిజిస్ట్రేషన్ చేయడం జరగదు. మరి అలాంటప్పుడు గెడ్డ స్థలం 47 గజాలు పూర్వీకులది అనడానికి ఎలాంటి ఆధారాలు లేకపోయినా పెదగంట్యాడ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ఏ విధంగా చేశారో అధికారులకే తెలియాలి.

మూడు యూనిట్ల ప్లాన్‌లో 8 యూనిట్లు..

మాధవరావు కొనుగోలు చేసిన 137 గజాలు పక్కన ఉన్న 37 గజాలు కలిపి మొత్తంగా 183.55 గజాలను సాయి కనస్ట్రక్షన్స్ నిర్వాహకులు డెవలప్‌మెంట్‌కు తీసుకున్నారు. ఆ స్థలంలో నిర్మాణాలకు ప్లాన్ అనుమతులకు దరఖాస్తు చేయగా ఫ్లోర్‌కు 987 అడుగుల విస్తీర్ణంలో ఒక యూనిట్ లెక్కన మూడు ఫ్లోర్ల భవనానికి అనుమతులు మంజూరు చేశారు. అయితే బిల్డర్ మాత్రం ఫ్లోర్‌కు 800 అడుగుల విస్తీర్ణంలో రెండు యూనిట్లు చొప్పున నాలుగు ఫ్లోర్ల నిర్మాణానికి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్ చేసి నిర్మాణాలు చేస్తున్నారు.

అయితే ప్లాన్‌కు విరుద్ధంగా ఏకంగా అయిదు యూనిట్లు నిర్మాణం చేస్తున్నా- జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కిమ్మనకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ భవన నిర్మాణంలో అధికారులకు భారీగా ముడుపులు అందినట్టు ఆరోపణలున్నాయి. అందుకే అడ్డగోలుగా గెడ్డ స్థలం ఆక్రమించుకుని మరీ నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఈ వ్యవహారంపై స్థల యజమాని మాధవరావు కుమారుడు పీఎస్వీ మూర్తి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మేము కొనుగోలు చేసింది 137 గజాలేనని, మిగిలిన 47 గజాలు గెడ్డ స్థలమని స్వయంగా యజమానులే ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. అంతేకాకుండా ఫిర్యాదుదారుడు మూర్తికి స్థానిక సచివాలయ టౌన్‌ప్లానింగ్ కార్యదర్శి ముత్యం ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుడు ఆమెతో మాట్లాడిన మాటలు కాల్ రికార్డ్ చేసి బిల్డర్‌కు పంపించారని మూర్తి తెలిపారు. దీనిపై జోన్-3 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మధుసూదనరావును అడగ్గా ఫిర్యాదుదారుని ఫిర్యాదు మేరకు నిర్మాణదారులకు నోటీస్ ఇచ్చి పనులు ఆపించినట్టు తెలిపారు.

మహానాడుకు 22వ వార్డు టీడీపీ నాయకులు


మహానాడులో పాల్గొన్న 22వ వార్డు టీడీపీ నాయకులు

మద్దిలపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి) : కడపలో నిర్వహిస్తున్న మహానాడుకు టీడీపీ జీవీఎంసీ 22వ వార్డు నాయకులు భారీ ఎత్తున తరలివెళ్లారు. టీడీపీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు మంగళవారం మహానాడులో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులతో సెల్ఫీలు దిగి సందడి చేశారు. ఈ సందర్భంగా బొట్టా వెంకటరమణ మాట్లాడుతూ మహా ఉత్సవంలా ప్రారంభమైన మహానాడుతో కార్యకర్తలతో నూతనుత్తేజం కలిగిందన్నారు. ఇదే ఉత్సాహంతో పార్టీ మరింత పటిష్టతకు సైనికుల్లా పనిచేస్తామన్నారు. ఎలాంటి కష్టనష్టాలు ఎదురైనా పార్టీ అండ ఉందనే నమ్మకంతో ముందుకు వెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వి స్వామి, ఆనంద్, డేవిడ్, నాగేశ్వరరావు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీల అమలు కోరుతూ 2న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సీపీఐ ధర్నా

ఆరిలోవ, మే 27 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికలు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 2వ తేదీన సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించనున్న ధర్నాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో మంగళవారం ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద ప్రజల ఇళ్లకు అర్బన్ ప్రాంతంలో రెండు సెంట్ల భూమి ఇచ్చి, నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయల ఇస్తామని, అలాగే గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్ల భూమి, రూ.నాలుగు లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటిని సూపర్ సిక్స్ పథకాలు అమలుపై దృష్టి సారించకపోవడం భావ్యం కాదన్నారు. అందుకు హామీల అమలు కోరుతూ సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంవలో పేద ప్రజలంతా పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దేవుడమ్మ, కాసు బాబు, లక్ష్మణరావు, పుష్పలత, రాము, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌బీ కాలనీలో యూజీడీ మ్యాన్‌హోల్స్ ఇబ్బందులు

- తరచూ పొంగిపొర్లుతుండడంతో రాకపోకలకు తప్పని అవస్థలు


మురుగుతో నిండిపోయిన కొండవాలు ప్రాంతంలోని రోడ్డు మార్గం


యూజీడీ లీక్‌తో చిత్తడిగా మారిన ప్రాంతం

వెంకోజీపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మేన్‌హోల్‌లు పొంగిపొర్లుతున్నాయి. దీంతో మురుగంతా రోడ్డుపైనే నిలిచిపోయి అటు వాహనచోదకులు, ఇటు పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అసలే ఒక పక్క కరోనా మళ్లీ మొదలైందనే భయాందోళనలో ప్రజలు బిక్కుబిక్కుమంటుంటే, దీనికి తోడు ఈ మురుగు ఎప్పటికప్పుడూ రోడ్డు ప్రవహించడం మరింత ఆందోళనను కలిగిస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కంటితుడుపు చర్యలు తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌బీకాలనీ ఆఖరు బస్టాప్, పై బస్టాప్ ప్రాంతాల్లో కొండ వైపు ఉండే మార్గాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు పొంగి పొర్లుతూ ప్రధాన రహదారిపైకి మురుగునీరు ప్రవహిస్తూ ఉంటుంది. దీంతో ఇటువైపు వెళ్లే పాదచారులు నానాఅవస్థలు ఎదుర్కొంటున్నారు.

ఎప్పటికప్పుడూ మేన్‌హోల్స్ పొంగి మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుంటే తాము ఎలా భరించాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కోట్ల రూపాయలు వెచ్చిస్తూ అభివృద్ధి చేస్తున్న ఈ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యకు మాత్రం ఎటువంటి శాశ్వత పరిష్కారం చూపలేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

‘కందుకూరి’కి ఘన నివాళి


కందుకూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాలలు అర్పిస్తున్న సీఐటీయూ 'నాయకులు

ఆరిలోవ, మే 27 (ఆంధ్రజ్యోతి) : సంఘ సంస్కర్త, మూఢాచారాలకు వ్యతిరేకంగా, మహిళాభ్యుదయం, సమాజ మార్పుకోసం పోరాటం చేసిన వైతాళికులు కందుకూరి వీరేశలింగం వర్ధంతిని సానిక బీఎస్ఆర్ నగర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కందుకూరి చిత్రపటానికి ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం సీఐటీయూ నాయకులు నరేంద్రకుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం అనేక సామాజిక రుగ్మతలపై పోరాటం సలిపిన ధీశాలి కందుకూరి వీరేశలింగం అన్నారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా, మహిళా విద్య కోసం ఆయన జరిగిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో బీఎస్ఆర్ నాయకులు సన్యాసమ్మ, కళాకారులు మౌనిక, మంగ, హిమాకృతి, చరిహస్న, కుమారమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

‘విత్తన బంతులతో సామాజిక వనాలు పెంచడం అవసరం’


విత్తన బంతులపై అవగాహన కల్పిస్తున్న జూ క్యూరేటర్ మంగమ్మ, గ్రీన్‌క్లైమెట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

ఆరిలోవ, మే 27(ఆంధ్రజ్యోతి) : విత్తన బంతులతో సామాజిక వనాలను పెంచడం అవసరమని ఆంధ్రప్రదేశ్ ఎన్‌సీసీ 13వ బెటాలియన్ ఎల్టీ కల్నల్, కమాండింగ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్ పేర్కొన్నారు. ఇందిరా గాంధీ జూలాజికల్ పార్కులో క్యూరేటర్ మంగమ్మ ఆధ్వ ర్యంలో, గ్రీన్‌క్లైమెట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం నేతృత్వంలో మంగళవారం ఉదయం ఎన్‌సీసీ క్యాడెట్లు పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఔషధ గుణాలు ఉన్న, గూళ్లు పెట్టుకొనే పక్షులు, ఇతర జీవులకు ఆహారాన్ని ఇచ్చే చెట్ల విత్తనాలతో విత్తన బంతులు తయారు చేయించడం జరిగిందని తెలిపారు. పది వేల సంవత్సరాల క్రితం వ్యవసాయం చేయడం ప్రారంభించిన కాలంలో విత్తన బంతులు తయారుచేసి తమకు అవసరమైన చోట వనాలను పెంచారని తెలిపారు. విత్తన బంతుల ద్వారా దేశీయ విత్తనాలను పరిరక్షించు కునే అవకాశం కూడా ఉందన్నారు. సామాజిక వనాలను పెంచడం ద్వారా పర్యావరణానికి మేలు చేసిన వారం అవుతామన్నారు. ఏటా గ్రీన్ క్లైమెక్స్ టీం ఎన్‌జీవో ప్రతినిధులు కలసి విత్తనాలతో విత్తన బంతుల చేయడం జరుగుతుందన్నారు ఇవి అడవులు, జీవరాశికి ఊపిరి అందిస్తాయన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ క్యూరేటర్ గోపాల్, ఎన్‌సీసీ డిప్యూటి క్యాంపస్ కమాండెంట్ లెఫ్టినెంట్‌క ల్నల్ స్వర్నియ, సుభేదార్ మేజర్ శ్రీనివాస్, సుభేదార్ సువాన్ జేవీ రవితేజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం

వెంకోజీపాలెం, మే 27(ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని కోదండ రామాలయంలో వేంచేసియున్న శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం తృతీయ వార్షికోత్సవంబుధవారం నిర్వహించనున్నట్టు గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీల కనకరాజు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం 5 గంటలకు సుప్రభాత సేవ 7.30 గంటలకు అర్చన సేవా, విశ్వక్సేన పూజ, భగవత్ పుణ్యాహవాచనము, పరిషత్ విజ్ఞాపన, రక్షా సూత్రధారణ, మండపారాధన, అష్టోత్తర శత కలశారాధన, స్వామివారికి అష్టోత్తర శతకలశాభిషేకము విశేష హోమములు నిర్వహించనున్నట్టు చెప్పారు. సాయంత్రం ఐదు గంటల నుంచి శ్రీవారి కల్యాణ మహోత్సవము అనంతరము పుష్పాంజలి పవళింపు సేవ జరుగుతుందన్నారు.

శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో అమావాస్య ప్రత్యేక పూజలు


ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

వెంకోజీపాలెం, మే 27(ఆంధ్రజ్యోతి) : అమావాస్యను పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసియున్న కాలబైరవ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి ప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కరశర్మలు భక్తుల పేరిట ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ బోర వెంకటరమణారెడ్డి, శరకం సత్యారావు, బోర యర్రాజీరెడ్డి, వేగి వెంకటరమణ ఇతర సంఘం సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం),సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం)
- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **నిశ్శబ్దప్రేమ** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం),
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: రమాదేవి, సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 15, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 18, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 32, బీరకాయలు 36, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజీ 15, క్యారెట్ 38 దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)54, బరబాటి 26, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోసకాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 30, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, క్యారపెండలం 18, మామిడి అల్లం 56, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

అతిథి అధ్యాపకుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా

- ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న అతిథి అధ్యాపకులు సంఘం సభ్యులు

వెంకోజీపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో పని చేస్తున్న అతిథి అధ్యాపకులకు అన్ని రకాల సమస్యలను పరిశీలించి అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మంగళవారం తనను కలిసిన అతిథి అధ్యాపకుల సంఘం సభ్యులకు హామీ ఇచ్చారు. గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఫర్ సెమిస్టర్ ఫర్ పేపర్ రూ.45000 ఇస్తున్నారని నెలకు రూ.7500 వస్తున్నాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు అతిథి అధ్యాపకులు వివరించారు. పనికి ఆహార పథకం కన్నా చాలా తక్కువ అమౌంట్ తమకు జీతం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏయూలో మొత్తంగా 1200 మంది ఆచార్యులు ఉండాల్సి ఉన్నా ప్రస్తుతం 168 మంది పర్మనెంట్ ఫ్యాకల్టీ మాత్రమే పనిలో ఉన్నారని తెలిపారు. మిగతా అంతా కూడా అతిథి అధ్యాపకులతో బోధన కొనసాగిస్తున్నారని, సుమారుగా 400 మంది అతిథి అధ్యాపకులతో బోధన యూనివర్సిటీ నడుస్తూ ఉందని చెప్పారు. తమకు సరైన రీతిలో వేతనాలు లేకపోవడంతో కుటుంబం నడపడం కూడా చాలా కష్టంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. యూనివర్సిటీలో ఉన్నటువంటి ప్రాక్టీస్ ఆఫ్ ప్రొఫెసర్, ఏజెంట్ ప్రొఫెసర్, కాంట్రాక్ట్ ఫ్యాకల్టీకు నెలకు రూ.80 వేలు జీతాన్ని ఇస్తున్న వారికి నోటిఫికేషన్ లేవని, ఇంటర్వ్యూ లేవని అంతా రూల్స్‌కి భిన్నంగా జరిగినటువంటి రిక్రూట్‌మెంట్ విధానమేనని, సిక్స్ మాన్ కమిటీతో ఇంటర్వ్యూలు చేసి, వీసీతో రేటిఫైడ్ చేసినటువంటి పోస్టులు ఆయన అతిథి అధ్యాపకులకు తప్పని తిప్పలుగా ఉన్నాయని, అతిథి అధ్యాపకులకు ఇతర యూనివర్సిటీలో మాదిరిగా నెలవారీ జీతాలు ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు.

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆదికవి నన్నయ్య వర్సిటీ, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, జేఎన్టీయూ కాకినాడ, ఆంధ్రకేశ్వర విశ్వవిద్యాలయం అన్ని యూనివర్సిటీలు అతిథి అధ్యాపకులకు నెలవారీ జీతాలు ఇస్తున్నారని, అత్యధికంగా నెలకు రూ.50 వేలు వరకు ఇవ్వవచ్చని యూజీసీ నిబంధన తెలియజేస్తున్నాయని, వీటి ప్రకారం న్యాయం చేయవలసిందిగా ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎం.సురేష్ మీనన్, డాక్టర్ విక్రమ్, డాక్టర్ సూరిబాబు, డాక్టర్ దేవానంద్, డాక్టర్ శిరీష్, డాక్టర్ కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌బీ కాలనీ ప్రధాన మార్గం జలమయం

- నిలిచిపోయిన ట్రాఫిక్


వర్షం నీటితో నిండిపోయిన హెచ్‌బీ కాలనీ ప్రధాన మార్గం

వెంకోజీపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలో మంగళవారం సాయంత్రం అకస్మాతుగా కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీ స్టీల్‌ప్లాంట్ మెయింటెనెన్స్ కార్యాలయం వద్ద గత ఏడాది నూతనంగా నిర్మించిన మోడ్రన్ ఫుట్‌పాత్‌ల కారణంగా, రోడ్డుపై నీరు కాలువలోకి వెళ్లే మార్గం సక్రమంగా లేకపోవడమే కాకుండా ఇక్కడి ఫుట్‌పాత్‌లపై నిర్వహిస్తున్న వ్యాపారాల వల్ల కాలువలు నిలిచిపోయి వర్షపు నీరంతా రోడ్డుపైకి వచ్చి చేరింది. వర్షపు నీరు ఎటూపోకుండా రోడ్డుపైనే నిలిచిపోతుంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వర్షం పడినప్పుడల్లా పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా పోతోంది. అంతేకాకుండా వాహనాలన్నీ ఒకే మార్గంలో పయనించాల్సిన పరిస్థితి. దీంతో వర్షం వస్తే చాలు ఈ ప్రాంతంలో ట్రాఫిక్ జాం అయిపోతుంది. ఇప్పటికైనా జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు స్పందించి సరైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పోర్టు పూల్ కలాసీల సమస్యలు పరిష్కరించాలి

- పోర్టు చైర్మన్‌కు పలువురు నేతల వినతి

పెదవాల్తేరు, మే 27 : (ఆంధ్రజ్యోతి) విశాఖ పోర్టు పూల్ కలాసీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పోర్ట్ చైర్మను బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్ రాజు, ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కూమార్, టీడీపీ కార్మిక సంఘం దళిత నాయకుడు జుంజురు గోవింద్ తదితరులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుండి పూల్ కలాసీలు పోర్టును నమ్ముకుని, చాలీచాలని జీతాలతో పని చేస్తున్నారని, పూల్ కార్మికులు ఎన్నో ఏళ్ళుగా పోర్టును నమ్ముకొని జీవనం సాగిస్తున్నారని అన్నారు.

ఈ సమస్యను ఎదు ర్కొంటున్న పోర్ట్‌పూల్ కలాసీలు, పూర్వపు పోర్టు ఉద్యోగులు సర్వీస్‌లో ఉండగా మరణానంతరం చేరిన వారి ఆ ఉద్యోగుల పిల్లలు అని తెలిపారు. పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పూల్ కలాసీలు పని చేస్తున్నారని వివరించారు. ఈ విషయమై పోర్ట్ చైర్మన్ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పూల్ కలాసీ యూనియన్ ప్రతినిధులు వాసుపల్లి రాము, రమేష్, బీమా, శంకర్, పొట్టి హరి తదితరులు పాల్గొన్నారు.



మహానాడు సంబరం





కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.



భైరవస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు





అభిషేకం చేస్తున్న అర్చకుడు, ఆలయంలో భక్తులు

▸▸ వైశాఖ అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు

సింహాచలం, మే 27 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయంగా అడివివరం గ్రామానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో కొలువైన భైరవస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. వైశాఖమాస బహుళపక్ష అమావాస్య సందర్భంగా సూర్యోదయానికి ముం దు నుంచే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తుల రాక ఆరంభమైంది. తొలుత అడివివరంలోని అప్పన్న స్వామికి చెందిన పుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి భైరవస్వామిని దర్శించుకున్నారు. భైరవునికి పలురకాల పుష్పాలు, వడమాలలు సమర్పించడంతో పాటు క్షీరాభిషేకాలు జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సకల గ్రహాల దోషాల నివారణ నిమిత్తం పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడి నుంచి కొందరు భక్తులు సింహగిరికి చేరుకుని అప్పన్నను దర్శించుకున్నారు.

మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తాం

▸▸ విశాఖ పోర్టు చైర్మన్ అంగముత్తు

విశాఖపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి): ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తామని విశాఖపట్నం పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు హామీ ఇచ్చారు. హార్బర్‌కు చెందిన మత్స్యకార నాయకులతో కలిసి 'దక్షిణ' ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం పోర్టులో చైర్మన్‌ను కలిసి పలు సమస్యలను వివరించారు. కొవిడ్ సమయంలో పోర్టుకు చెల్లించాల్సిన పన్నులను కట్టలేకపోయామని, వాటిని రద్దు చేయాలని కోరగా పరిశీలిస్తామని అంగముత్తు హామీ ఇచ్చారు. అలాగే బోట్లను వార్ఫ్‌పై ఉంచేందుకు అవసరమైన క్రేన్లను పోర్టు ద్వారానే సమకూర్చాలని కోరగా అందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్ల అసోసియేషన్, డాల్ఫిన్ బోట్ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. తాను హామీ ఇచ్చిన విధంగా పోర్టు చైర్మన్‌తో మత్స్యకార నాయకులు కలిసే అవకాశం కల్పించి వారి సమస్యల పరిష్కారానికి ప్రయత్నించానని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.



అంగముత్తుకు మత్స్యకారుల సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

1 నుంచి విశాఖ-గుణుపూర్ రైలు వేళల్లో మార్పులు

విశాఖపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్‌లో నౌపడ జంక్షన్-గుణుపూర్ మధ్య తిరిగే రైళ్ల సమయాలు జూన్ ఒకటో తేదీ నుంచి మారుతున్నట్టు అధికారులు మంగళవారం తెలిపారు. విశాఖపట్నం నుంచి గుణుపూర్ వెళ్లే 58506 నంబర్ గల రైలు విశాఖలో ఉదయం 5.30 గంటలకు బయలుదేరుతుంది. మారిన సమయం ప్రకారం తెంబూరునుంచి 9.44 గంటలకు బయలుదేరి పాతపట్నం, పర్లాకిమిడి, సీతాపురాల మీదుగా గుణుపూర్‌కు 11.55 గంటలకు చేరుతుంది. అటు నుంచి 58505 నంబర్ గల రైలు గుణుపూర్‌లో మధ్యాహ్నం 2.30కు బయలుదేరి టెక్కలికి 4.17గంటలకు చేరుతుంది.

- రూర్కెలా-గుణుపూర్ మధ్య నడిచే 18117/18118 నంబర్ గల రైళ్లు రూర్కెలాలో రాత్రి 9.25 గంటలకు బయలుదేరి పర్లాకిమిడికి మర్నాడు మధ్యాహ్నం 12కు చేరుతుంది. ఇది కాశీనగర్ మీదుగా గుణుపూర్‌కు మధ్యాహ్నం 1.25 గంటకు వెళుతుంది. తిరుగు ప్రయాణంలో గుణుపూర్‌లో సాయంత్రం 4 గంటలకు బయలుదేరి పర్లాకిమిడికి 4.58 గంటలకు చేరుతుంది.
- పూరీ-గుణుపూర్ మధ్య నడిచే 18417/18418 రైళ్లు పూరీలో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి టెక్కలికి సాయంత్రం 6.19కు చేరుతుంది. గుణుపూర్ చేరేసరికి రాత్రి 8.25 గంటలవుతుంది. తిరుగు ప్రయాణంలో గుణుపూర్ నుంచి ఉదయం 5.30 గంటలకు బయలుదేరి టెక్కలికి 7.12 గంటలకు చేరుతుంది.
- కటక్-గుణుపూర్ మధ్య నడిచే 68433/68434 నెంబరు రైళ్లు కటక్‌లో సాయంత్రం 5.15 గంటలకు బయలుదేరి పర్లాకిమిడికి అర్ధరాత్రి 12.02 గంటలకు చేరుతుంది. అక్కడి నుంచి గుణుపూర్‌కు రెండు గంటలకు వెళుతుంది. తిరుగు ప్రయాణంలో ఉదయం 3 గంటలకు బయలు దేరి టెక్కలికి 4.54కు చేరుకుని, అక్కడి నుంచి 4.55 గంటలకు బయలుదేరుతుంది.

'అందరికీ యోగా' థీమ్‌తో యోగాసన పోటీలు

డీఈవో ప్రేమ్‌కుమార్

సిరిపురం, మే 27 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకు విశాఖపట్నం జిల్లాలో యోగాంధ్ర పోటీలలో భాగంగా 'అందరికీ యోగా' అనే థీమ్‌తో గ్రామ, మండల, జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయిల్లో మూడు కేటగిరీల్లో యోగాసన పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్‌కుమార్, అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జె.చంద్రశేఖర్ తెలిపారు. ఈ యోగా పోటీలను ఈ నెల 28, 29, 30 తేదీల్లో జూనియర్స్ 10 నుంచి 18 ఏళ్లలోపు, యూత్ 19 నుంచి 35 ఏళ్లలోపు, సీనియర్స్ 35 పైబడిన వారు స్త్రీ, పురుషులు, బాలబాలికలు పాలొనవచ్చన్నారు. యోగా ప్రోటోకాల్ పేర్కొన్న అసనాల్లో పోటీలను నిర్వహించి, విజేతలను ఎంపిక చేసి వారి డేటాను యోగాంధ్ర మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలియజేశారు. ఈ పోటీల గురించి గ్రామస్థాయిలో విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించి ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలని పాఠశాల ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు, సీఆర్పీలకు, వ్యాయామ విద్యా ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే జూన్ 16, 17 తేదీల్లో రాష్ట్రస్థాయి యోగాసన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

ఆధార్ అనుసంధానానికి పోస్టాఫీసుల్లో ప్రత్యేక శిబిరాలు

ఎంవీపీ కాలనీ, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ అనుసంధానానికి పోస్టాఫీసుల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు విశాఖపట్నం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ గజేంద్రకుమార్ మీనా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించబోయే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాలకు నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఆధార్ నెంబరును బ్యాంకు ఖాతాతో లింక్ చేయడం తప్పనిసరి అని తెలిపారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ సేవింగ్స్ ఖాతాలతో ఆధార్ లింకేజీ కోసం ఈ నెల 31 నుంచి జూన్ 4 వరకూ పోస్టాఫీసుల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ అకౌంటుతో ఆధార్ అనుసంధానం జరిగిన తర్వాత పథకాల ద్వారా జమ అయ్యే నగదును ఏ పోస్టాఫీసులో అయినా తీసుకోవచ్చని, అలాగే ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్‌లకు లింక్ చేసి, నెఫ్ట్, ఐఎంపీఎస్, యూపీఐ లావాదేవీలు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులందరూ వినియోగించుకోవాలని తెలిపారు. తమకు దగ్గరలోని పోస్టాఫీసును సంప్రదించాలని తెలిపారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

అక్కిరెడ్డిపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి): టెక్ మహేంద్ర ఫౌండేషన్ సహకారంతో కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్‌లో డిగ్రీ, ఇంటర్ చదివిన నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి ఇవ్వనున్నట్టు బొల్లినేని మెడి స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు గల డిగ్రీ, ఇంటర్ చదివిన నిరుద్యోగ విద్యార్థులకు హెల్త్ కేర్ బిల్లింగ్, జీడీఏ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 7207953919, 7995013421 సెల్ నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

విశాఖ పోర్టులో ఈవీ చార్జింగ్ స్టేషన్ ప్రారంభం



పోర్టులో ఏర్పాటు చేసిన ఈవీ చార్జింగ్ స్టేషన్. (ఇన్‌సెట్లో ప్రారంభిస్తున్న చైర్మన్)

విశాఖపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టులో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) చార్జింగ్ స్టేషన్‌ను చైర్మన్ ఎం.అంగముత్తు మంగళవారం ప్రారంభించారు. రెండు డీసీ ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లు, రెండు ఏసీ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. వీటిద్వారా ఒకేసారి ఆరు ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ చేయవచ్చని ఆయన వెల్లడించారు. పోర్టులో పర్యావరణ అనుకూల సదుపాయాల కల్పనలో భాగంగా వీటిని ఏర్పాటు చేశామని సెక్రటరీ వేణుగోపాల్ తెలిపారు.